ప్రజాశక్తి

సోమవారం 24 ఏప్రిల్ 2023 8 పేజీలు





గుంటూరు పల్నాడు

మళ్లీ ముంచిన వాన

గుంటూరు పల్నాడు జిల్లాలో ఆదివారం అకాల వర్షం రైతులను మరోసారి దెబ్బతీసింది. వడగళ్ల వాన, ఈదురుగాలులతో పలుచోట్ల మిర్చి, ధాన్యం, మొక్కజొన్న పంటలతోపాటు తోటలూ దెబ్బతిన్నాయి. మరోవైపు పుచ్చ, ఖర్బూజ, బత్తాయి తదితర తోటలూ ధ్వంసమై రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇవన్నీ ఒకెత్తయితే మిర్చి పంటను కాపాడుకునే ప్రయత్నంలో ఇద్దరు రైతులు మృత్యువాత పడడం మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. ఇదిలా ఉండగా గాలుల దాటికి చెట్లు విరిగిపడి ఇళ్లు ధ్వంసం కావడంతోపాటు విద్యుత్ సరఫరా, వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

ప్రత్తిపాడులో మిర్చిపై పట్టాలు కప్పుతున్న రైతులు, వడగండ్లు (ఇన్‌సెట్)





ఈపూరు మండలం ఇనిమెళ్లలో దెబ్బతిన్న బొప్పాయి తోట

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

నియోజకవర్గ కేంద్రమైన ప్రత్తిపాడులో ఆదివారం ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వాన కురిసింది. ఉరుములు, మెరుపులతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. కళ్లాల్లోని మిర్చి పంట తడవకుండా కాపాడుకోవడానికి రైతులు నానా తంటాలు పడినా కొన్నిచోట్ల పంట తడిసింది. గాలుల ఉధృతికి పర్చూరు మార్గంలో హైస్కూల్ దాటిన తర్వాత దాదాపు 10 చెట్లు కూలిపోవడంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తిక్కిరెడ్డిపాలెం గ్రామ పరిధిలోని ఓ షెడ్డుపైన ఉన్న రేకులు ▸ 2లో

పిడుగుపడి ఇద్దరు దుర్మరణం

మిర్చి పంటపై పట్టాలు కప్పుతుండగా ఘటన

ప్రజాశక్తి - ప్రత్తిపాడు





మృతులు శ్యామ్‌బాబు, కృపానందం (ఫైల్)

పిడుగుపడి ఇద్దరు రైతుతోపాటు అతనికి సాయంగా వెళ్లిన మరోకరు మృత్యువాత పడ్డారు. మండలంలోని పాతమల్లాయపాలెంలో జరిగిన ఘటనపై వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చాట్ల శ్యామ్‌బాబు (47) పదెకరాల్లో మిర్చి సాగు చేశాడు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఉన్నట్టుండి వాతావరణం చల్లబడ్డంతో వర్ష సూచనను గమనించిన శ్యామ్‌బాబు తన భార్య సువర్ణ, కుమారుడు ప్రకాష్‌కుమార్, తమ్ముడు ప్రసాద్, తమ్ముని కుమారుడు ప్రకాష్, స్నేహితులు కొరివి కృపానందం (57), నీలం పిచ్చయ్యనూ వెంటబెట్టుకుని తన పొలం వద్దకు పురుగున వెళ్లారు. ఏడెకరాల మిర్చి పంట కళ్లంలో ఉండడంతో దానిపై పట్టాలు కప్పడానికి అందరూ ప్రయత్నిస్తున్నారు. శ్యామ్‌బాబు, కృపానందం ఒకవైపు పట్టను సరిచేస్తుండగా మిగతావారు మిగతా వైపు ఉన్నారు. ఈ క్రమంలో ఉన్నట్టుండి పిడుగు పడడంతో శ్యామ్‌బాబు, కృపానందం అక్కడే కుప్పకూలారు. సువర్ణ, ప్రసాద్ కూడా షాక్‌తో పడిపోయారు. అయితే కొద్దిసేపటికి ఇద్దరూ తేరుకోగా శ్యామ్‌బాబు, కృపానందం లేవలేదు. దీంతో హుటాహుటిన వారిని ఓ కారులో ప్రత్తిపాడులోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే వారు మృతి చెందినట్లు సిబ్బంది నిర్ధారించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)కు తరలించారు. మృతుడు శ్యామ్‌బాబుకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు కాగా కృపానందానికి భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.



మజ్జిగను అందిస్తున్న గుంటూరు విజయ్‌కుమార్

సిపిఎం ఆధ్వర్యంలో చలివేంద్రం

రెంటచింతలలో ప్రారంభించిన పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్

ప్రజాశక్తి - రెంటచింతల

దాహార్తిని తీర్చడానికి ఏర్పాటు చేసే చలివేంద్రాల వల్ల బాటసారులకు, పొలాలకు వెళ్లే రైతులు, కూలీలకు ఎంతోః ఉపయోగమని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్ అన్నారు. మండల కేంద్రమైన రెంటచింతలలోని బస్టాండ్ సెంటర్లో సిపిఎం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం, మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ప్రతి వేసవిలోనూ ఇలాంటి కేంద్రాన్ని సిపిఎం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం అభినందనీయమని, వీటి నిర్వహణకు దాతలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి టి.నాగేశ్వరరావు, బి.మరియదాసు, పూర్ణయ్య, ఉమాభారతి, అనిత పాల్గొన్నారు.

మంగళగిరిలో నేడు ప్రచారభేరి బహిరంగ సభ

- హాజరుకానున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ
- జయప్రదం చేయాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపు

మాట్లాడుతున్న పాశం రామారావు



ప్రజాశక్తి - పెదనందిపాడు

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల, మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఈనెల 14-30 తేదీల్లో పెద్దఎత్తున ప్రచారభేరి నిర్వహిస్తున్నామని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. ఇందులో భాగంగా సోమవారం మంగళగిరిలో బహిరంగ సభ నిర్వహిస్తామని చెప్పారు. ఆదివారం పెదనందిపాడుకు వచ్చిన ఆయన స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రం వద్ద విలేకర్లతో మాట్లాడారు. బిజెపి పాలనలో పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్, నిత్యావసర సరుకులు ధరలు విపరీతంగా పెరిగాయని, ప్రజల ఆదాయాలు మాత్రం పెరగలేదని అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు పట్టుగొమ్మలైన ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్లకు కట్టబెడుతున్నారన్నారని అన్నారు. కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి తీరని అన్యాయం చేశారని, ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు, పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించలేదని చెప్పారు. రాజ్యాంగంలోని సమాఖ్య స్ఫూర్తిగా విరుద్ధంగా కేంద్ర వ్యవహరిస్తోందని, రాష్ట్రాల హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను వినియోగించుకొని ప్రతిపక్ష పార్టీల నాయకులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. నాలుగు లేబర్ కోడ్లను తెచ్చి కార్మిక హక్కులను కాలరాస్తున్నారని, వ్యవసాయాన్ని కార్పొరేట్ల పరం చేసేందుకు మూడు వ్యవసాయ చట్టాలను ▸ 2లో

ఆర్‌టిఇ కింద 445 మంది ఎంపిక

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు జిల్లాలో విద్యాహక్కు చట్టం (ఆర్‌టిఇ) 12(1)(సి) కింద 445 మంది విద్యార్థులు ప్రైవేటు మేనేజ్‌మెంట్ పాఠశాలల్లో ప్రవేశం కోసం ఎంపికయ్యారని గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల జాబితాను అన్ని మండల విద్యాశాఖ అధికారులు మండల కార్యాలయాల్లో ప్రదర్శించాలన్నారు. జాబితాలు సంబంధిత పాఠశాలలకు పంపించాలని, సిఆర్‌పిలు, సచివాలయ సిబ్బంది సహకారంతో ఎంపికైన విద్యార్థుల తల్లిదండ్రులతో పాఠశాల యాజమాన్యంతో మాట్లాడి విద్యార్థులకు ప్రవేశం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏ ప్రైవేటు పాఠశాల అయినా ప్రవేశం నిరాకరిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియ అంతా ఈ నెల 25వ తేదీతో పూర్తి కావాలని ఆదేశించారు.

అధికంగానే ఫ్లూ జ్వరాలు

- కరోనా నాలుగో దశ ఉధృతంగా లేదు
- 104 వాహనాల్లో గ్రామాలకు వైద్యులు
- ప్రజాశక్తితో పల్నాడు జిల్లా వైద్యాధికారి శోభారాణి

8లో

మూల్యాంకన కేంద్రం వద్ద అంబులెన్స్

పాఠశాల విద్యాశాఖ రాష్ట్ర ప్రధాన కమిషనర్ 2లో



మూల్యాంకన కేంద్రం వద్ద అంబులెన్స్

ప్రజాశక్తి - నరసరావుపేట: పాఠశాల విద్యాశాఖ రాష్ట్ర ప్రధాన కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్ పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్‌తో కలిసి పట్టణంలోని వినుకొండ రోడ్డులో ఉన్న సెయింట్ ఆన్స్ పాఠశాలలో జరుగుతున్న 10వ తరగతి పరీక్ష మూల్యాంకన కేంద్రాన్ని ఆదివారం పరిశీలించారు. మొత్తం 26 గదుల్లో 980 మంది ఉపాధ్యాయులతో మూల్యాంకనం సాగుతోంది. కేంద్రంలో ఉపాధ్యాయులకు అందిస్తున్న సదుపాయాలపై ప్రవీణ్‌ప్రకాష్ వివరాలడిగారు. పరీక్ష పేపర్లను ఉంచుతున్న స్ట్రాంగ్ రూమును పరిశీలించి అక్కడ నిర్వహిస్తున్న రక్షణను అడిగి తెలుసుకుని సూచనలు చేశారు. ఇటీవల గుండెపోటుతో ఉపాధ్యాయుడు జోజప్ప మృతి నేపథ్యంలో తక్షణ వైద్య వైద్య సేవలు అందించే విధంగా అంబులెన్స్ సిద్ధంగా ఉంచామన్నారు. పరిశీలనలో పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్ పాల్గొన్నారు.

మంగళగిరిలో నేడు ప్రచారభేరి బహిరంగ సభ

(మొదటి పేజీ తరువాయి)

తీసుకురాక రైతులు పోరాడి తిప్పికొట్టారని గుర్తు చేశారు. గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగింపు కోసం అవసరమైన భూసేకరణకు వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విస్తరణ పనులు పూర్తయ్యే వరకు ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తామని చెప్పారు. ప్రచారభేరీలో భాగంగా సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో మంగళగిరిలోని ఆటోనగర్లో సోమవారం సాయంత్రం ఐదు గంటలకు బహిరంగ సభ నిర్వహిస్తామని, సభకు సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకష్ణ హాజరవుతారని తెలిపారు. ఈనెల 25, 26 తేదీల్లో పెదనందిపాడు, ప్రత్తిపాడు, కాకుమాను మండలాల్లో ఆటో ప్రచార జాతాను ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు కె.నాగేశ్వరరావు, మండల కార్యదర్శి డి.రమేష్‌బాబు, ప్రజా సంఘాల నాయకులు ఎన్.ఆచారి, బి.శంకరయ్య, ఎల్.వెంకట నాగేశ్వరరావు, సిహెచ్.యానాదులు, జె.రామారావు, ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చంపేస్తామంటూ బెదిరిస్తున్నారని ఫిర్యాదు

ప్రజాశక్తి-తాడేపల్లి: స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, దుగ్గిరాలకు చెందిన దాసరి వీరయ్యలు తనను చంపాలని చూస్తున్నారని నియోజకవర్గ టిఎన్ఎస్ఎఫ్ నాయకలు రాయపూడి కిరణ్ ఆరోపించారు. ఆ మేరకు ఆదివారం ఆ పార్టీ కార్యకర్తలు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని సిఐ శేషగిరిరావుకు ఫిర్యాదు చేశారు. ఇటీవల ఉండవల్లి కొండ అక్రమ మైనింగ్‌ను బయటపెట్టి ఆందోళన చేసినందుకు, వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారని మీడియాకు చెప్పినందకు తనపై ఎమ్మెల్యే, అతని అనుచరుడు కక్ష కట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫోన్ చేసి బెదిరించడమే గాక చంపేస్తామని బెదిరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు చేయడానికి వెళ్లిన వారిలో రాయపూడి కిరణ్‌తో పాటు టిడిపి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, డి.జ్యోతిబసు, టి.శంకరరెడ్డి, కె.సాయిచంద్, ఎ.మురళీ తదితరులు ఉన్నారు.

యువచైతన్యం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-తెనాలిరూరల్: మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో తెలుగు యువత తలపెట్టిన యువచైతన్యం కార్యక్రమ గోడపత్రికను ఆదివారం ఆదోని నియోజకవర్గంలో నారా లోకేష్ ఆవిష్కరించారు. తెనాలి నియోజకవర్గంలో యువ చైతన్యం కార్యక్రమం ద్వారా చేపట్టబోయే కార్యాచరణను తెలియజేయడం జరిగిందని తెనాలి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు రావి సూర్యకిరణ్, కార్యదర్శి పాలడగు ప్రణీత్ తెలిపారు. ఈ సందర్భంగా లోకేష్ తెనాలి నియోజకవర్గంలో తెలుగుయువత నేతలు చేస్తున్న కార్యక్రమాలను అభినందించారు.


దుగ్గిరాలలో


ఈపూరు మండలం ఇనిమెళ్లలో దెబ్బతిన్న పంటలు


కారంపూడి మండలంలో పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

మళ్లీ ముంచిన వాన

(మొదటి పేజీ తరువాయి)

ఊడిపోవడంతో దాదాపు రూ.10 లక్షల నష్టం వాటిల్లినట్లు యజమాని తెలిపారు. పండ్ల వ్యాపారం చేసే తాను సరుకును ఈ షెడ్డులోనే దాస్తుంటానని చెప్పారు. మరోవైపు విద్యుత్ సరఫరా నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు.

పిడుగురాళ్ల: పట్టణంలో మధ్యాహ్నం 3 గంటల నుండి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. కళ్లంలోని మిర్చిని కాపాడుకోవడానికి పట్టాల కోసం రైతులు ఉరుకులు పరుగులు పెట్టారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఖలీల్ దాబా వద్ద నిర్మిస్తున్న హైవే వలన నీరు నిలబడి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. మరోవైపు గురజాల నియోజకవర్గం పరిధిలోని దాచేపల్లి మార్కెట్ యార్డులో అమ్మకం కోసం రైతులు ఉంచిన ధాన్యం కొంత వర్షం బారిన పడింది. అయితే రైతులు ముందుగానే అప్రమత్తమయ్యారు. రాసిగా ఆరబోసిన ధాన్యాన్ని కూలీల సాయంతో బస్తాల్లోకి ఎత్తారు. ఇప్పటికే సరైన దిగుబడులు లేవని, గతంలోనూ అకాల వర్షం తమను దెబ్బతీసిందని. తాజా వర్షం వల్ల రంగు మారింత ఇంకా నష్టపోతామని రైతులు వాపోతున్నారు. మొన్నటి వరకూ ధాన్యం బస్తా (75 కిలోలు) రూ.1500-1800 ఉందని, ఇటీవల వర్షం సాకుతో తగ్గించడంతో రైతులు అమ్ముకోకుండా యార్డులో నిల్వ చేసుకున్నారు. ప్రస్తుతం ఈ పంటను కాపాడుకోవడానికి రైతులు నానా అగచాట్లు పడ్డారు.

కారెంపూడి: వర్షం ఈదురుగాలులకు మండలంలోని పేటసన్నగండ్ల శివారు పొలాల్లోని విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మరం పడిపోయింది. మండలంలోని పలుచోట్ల విద్యుత్ వైర్లు తెగిపడి కరెంటు స్తంభాలు నేలకొరిగాయని, రైతులు పొలాలకు వెళ్లేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ శాఖ ఏఈ కోటేశ్వరరావు సూచించారు. తీగలు తెగి పడిన సమాచారాన్ని అధికారులకు తెలపాలని కోరారు.

ప్రజాశక్తి - చిలకలూరిపేట

నియోజకవర్గంలోని మిర్చి రైతులను వర్షం పరుగులు పెట్టించింది. మిర్చి పంట చివరి కోతలు తడవకుండా కాపాడుకొనేందుకు పట్టాల కోసం రైతులు పరుగులు పెట్టారు. చిరుజల్లుతోనే వాన ఆగిపోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

ఈపూరు: మండలంలోని బొమ్మరాజుపల్లి, భద్రుపాలెం, ఇనిమెళ్ళ గ్రామాలలో ఆదివారం ఈదురుగాలులతో వడగళ్ల వాన కురవడంతో పండ్ల తోటలు దెబ్బతిన్నాయి. వడగళ్ల దాటికి పుచ్చ,ఖర్బూజ కాయలు పగిలిపోయాయి. బత్తాయి,బొప్పాయి, తోటలలో కొమ్మలు విరగడంతో పాటు కాయలు నేలరాలాయి. అలాగే వడగండ్ల వాన ప్రభావంతో మిరప రైతులు నష్టపోయారు. ఇనిమెళ్ళ గ్రామానికి చెందిన గుర్రం వీరాంజనేయులు మాట్లాడుతూ 1.50 ఎకరాలలో పుచ్చ,1.50 ఎకరాలలో ఖర్బూజ సాగు చేశానని చేతికందే సమయంలో వడగండ్ల వాన తీవ్ర నష్టాన్ని మిగిల్చిందని ఆవేదన వ్యక్తంచేశారు.పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

దుగ్గిరాల: ఆదివారం ఉదయం 11 గంటల వరకు వాతావరణం మామూలలుగానే ఉన్నది. అనంతరం ఒక్కసారిగా మబ్బులు కమ్ముకొచ్చాయి, రైతులు చేలోకి వెళ్లే సమయం కూడా లేదు. ఒకసారిగా వర్షం ప్రారంభమైనది. వర్షానికి కండెలకు నష్టం లేదని, అయితే మిషన్ ఆడించిన మొక్కజొన్న విత్తనాలు మాత్రం నష్టపోయే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. వర్షం నుండి పంటను కాపాడుకోవడానికి రైతులు పొలాలకు పరుగులు తీయగా అప్పటికే చేలపై ఉన్న పంట తడిసింది. తిరిగి సాయంత్రం మూడు గంటల నుండి ఆకాశం మేఘావతమై ఉండడంతో రైతులు పూర్తిస్థాయిలో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దుగ్గిరాల దక్షిణ తూర్పు పొలాల్లో దాదాపు 500 ఎకరాల వరకు మిషన్ ఆడించిన మొక్కజొన్న విత్తనాలు చేలలో ఉన్నాయి. తడి ఆరాలంటే రెండు రోజులపాటు బాగా ఎండలు రావాలని, లేకుంటే మొక్కజొన్నకు బూజుపట్టే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రొంపిచర్ల: ఈదురు గాలులు, వడగండ్ల వర్షంతో విద్యుత్ సరఫరా నిలిచింది. పలుగ్రామాల్లో చెట్లు కూలి వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొన్ని చోట్ల ఇళ్ల పైకప్పులు, రేకులు లేచి పడిపోయాయి. రొంపిచర్ల శివాలయం కాలనీలోని ముక్కడాల నాగేశ్వరరావుకు చెందిన ఇంటిపై రేకులు లేచి పొలాల్లో చెల్లాచెదురుగా పడిపోయాయి. ప్యాన్లు విరిగిపోయాయి. ఇల్లు మొత్తం దెబ్బతిని రూ.లక్ష వరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు చెబుతున్నారు. కళ్లాల్లోని మొక్కజొన్న, మిర్చి తడవకుండా రైతులు పట్టాలు కప్పారు.


దాచేపల్లి యార్డులో ధాన్యం బస్తాలు


ప్రత్తిపాడు వద్ద కూలిన చెట్టు


రొంపిచర్లలో దెబ్బతిన్న ఇల్లు


ప్రత్తిపాడులో వడగండ్లు

టిడిపిలోకి చేరిన మునగపాటి

ప్రజాశక్తి -మంగళగిరి: పట్టణంలోని వైసీపీ నాయకులు మునగపాటి వెంకటేశ్వరరావు ఇటీవల ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఆదివారం ఆదోని నియోజకవర్గం కుప్పగల్లు శివారు ప్రాంతంలో జరుగుతున్న లోకేష్ పాదయాత్రలో మునగపాటి తన అనుచరులతో లోకేష్ సమక్షంలో టిడిపిలో చేరారు. గతంలో మునగపాటి వెంకటేశ్వరరావు బిజెపి నాయకులుగా ఉన్నారు. 2019 అసెంబ్లీ ఎన్నికల ముందు వైసీపీలో చేరారు. ఆ తర్వాత పట్టణంలో గల శివాలయం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్‌గా పనిచేశారు. ఈ కార్యక్రమంలో నిమ్మల రామానాయుడు, అమర్ నాథ్ రెడ్డి, మంగళగిరి టిడిపి నాయకులు నందం అబద్ధయ్య, జి ధనుంజయ రావు, కే.అంకమ్మరావు, టి. జానకి దేవి, గోవాడ దుర్గారావు, దామర్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ స్టేడియం అభివృద్ధికి కృషి


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

ప్రజాశక్తి -గుంటూరు జిల్లా ప్రతినిధి

సకల సౌకర్యాలతో ఎన్‌టిఆర్ స్టేడియంను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి తెలిపారు. ఆదివారం బృందావన్‌గార్డెన్స్‌లోని ఎన్‌టిఆర్ స్టేడియం సమావేశ మందిరంలో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టేడియం అబివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేసున్న ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తూ అన్ని క్రీడా సంఘాల ప్రతినిధులు ఆయనను ప్రత్యేకంగా సత్కరించారు. సమావేశానికి ప్రత్యేకంగా హాజరైన వాకర్స్ అసోసియేషన్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎస్.రవీంద్రను ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి శాలువాతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మే 5వ తేదీ లోపు ఫుట్‌పాత్ పూర్తి చేయాలని, 5వ తేదీ నుంచి శాశ్వత ప్రాతిపదికన వాకింగ్ ట్రాక్ ఆధునీకరణ పనులు ప్రారంభించాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. లేడీస్, జంట్స్ టాయిలెట్లు త్వరితగతిన అందుబాటులోకి తేవాలన్నారు. మే నెలాఖరులోగా జిమ్ బిల్డింగ్ పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని కోరారు మే 1వ తేదీ నుంచి జరగనున్న వేసవి శిక్షణా శిబిరంలో క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా పక్కాగా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా తమకు వేతనాలు సరిగా అందడం లేదని కొందరు కోచ్‌లు ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డికి సమస్యను విన్నవించుకున్నారు. దీనిపై తక్షణమే స్పందించిన లేళ్ళ అప్పిరెడ్డి అక్కడే ఉన్న కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ చెరువు శ్రీనివాస్, ఈఈ సుందరరామిరెడ్డితో ఈ విషయమై మాట్లాడి వారికి సకాలంలో వేతనాలు అందేలా తగు చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో కార్పొరేటర్లు గోపీ శ్రీనివాస్, ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), అచ్చాల వెంకటరెడ్డి, మోతుకూరి వెంకటరత్నం, స్థానికులు వజ్జా రామకష్ణ, అంకారావు, కొత్తపల్లి సాంబిరెడ్డి, ఏఈ సునీల్, స్టేడియం సిబ్బంది, అన్ని క్రీడలకు సంబంధించిన కోచ్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

ఘనంగా ట్రెవా వార్షిక సమావేశం

ప్రజాశక్తి-గుంటూరు: ట్రెజరీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా వార్షిక సమావేశం ఆదివారం ఇన్‌ఛార్జి ప్రెసిడెంట్ సైదులు అధ్యక్షతన స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డి.వెంకటేశ్వర్లు, విజయవాడ తూర్పు ట్రెజరీ ఎటిఒ సుబ్రహ్మణ్యం, ట్రెవా రాష్ట్ర సహాధ్యక్షులు కె.ముత్యాలరావు, రిటైర్డ్ ఎటిఒ పి.కోటేశ్వరరావు, ట్రెవా కార్యదర్శి పి.నాగరాజు, జాతీయ షిప్పింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ బి.మల్లిఖార్జునరావు, జిల్లా ఎన్‌జిఒ కార్యదర్శి సతీష్, కార్యనిర్వాహక కార్యదర్శి మూర్తి తదితరులు ప్రసంగించారు. పెన్షనర్లు ఈ నెల చివరి వరకూ లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలని, కమ్యూటన్ పీరియడ్ 15 ఏళ్ల నుండి 12 ఏళ్లకు తగ్గించాలని, ఇన్‌కం ట్యాక్స్ నుండి పెన్షనర్లను పూర్తిగా మినహాయించాలని, ఇకెవైసి వీలైనంత త్వరగా చేయాలని, ఇహెచ్ఎస్ ద్వారా నగదు లేకుండా వైద్యం అందించాలని నాయకులు కోరారు. అనంతరం 75 ఏళ్లు నిండిన పెన్షనర్లను సన్మానించారు.

కృష్ణా నదిలో స్నానానికి దిగి మృతి

ప్రజాశక్తి-అమరావతి

అమరావతిలోని కృష్ణా నదిలో స్నానానికి దిగిన వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం సాయంకాలం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గుంటూరు శారదా కాలనీకి చెందిన పఠన్ మాబుల (53) తన కుటుంబ సభ్యులతో కలిసి విహారయాత్రకు వెళ్లారు. అమరలింగేశ్వర స్వామి ఆలయ సమీపంలో ని ఘాట్‌కు తన కుటుంబలో సభ్యులతో కలిసి స్థానం చేసేందుకు వెళ్లారు. ప్రమాదవశాత్తు మాబుల నదిలో జారిపడ్డాడు. మాబును



పఠన్ మాబుల

వెతి కేందుకు అక్కడి వారు ఎవరూ సహ కరించకపోవ డంతో అతని కుమార్తె నది లోకి దూకి తండ్రిని వెతికే ందుకు యత్నించగా అక్కడ ఉన్న వారు వద్దని వారించారు. స్థానిక ప్రజాశక్తి విలేకర్ అనిల్, ఆమెను పోలీసుల సాయంతో రక్షిం చారు. అనంతరం ఎస్పై గజ ఈతగాల సాయంతో మృతదేహాన్ని వెలికితీసి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎస్ఐ మహబూబ్ సుభాని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నదిలో తండ్రిని వెతికేందుకు యత్నిస్తున్న కూతురుని ఆపుతున్న ప్రజాశక్తి విలేకరి అనిల్

చిలకలూరిపేట, సత్తెనపల్లిలో కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పట్టణంలోని వైయస్సార్ కాలనీలో పోలీసులు ఆదివారం ఉదయం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రా లు లేని 18 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని అర్బన్ సి.ఐ.. జి. రాజేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భం గా ఆయన పోలీస్ స్టేషన్లో విలేకరులతో మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డి.ఎస్.పి.విజయ భాస్కర్ అధ్వర్యంలో ఈ కార్డెన్ సెర్చ్ కార్య క్రమాన్ని చేపట్టామన్నారు. ఊ రు చివర ఉన్న వైఎస్సాఆర్ కాలనీ లో ఈ కార్డన్ చర్చ జరిగిందన్నారు. సుమారు ఆరు వందల ఇళ్లను పూర్తి స్థాయిలో పరిశీలించి అక్కడి ప్రజలకు పలు సూచనలు చేసినట్లు తెలిపారు. అంతే కాకుండా ప్రస్తుతం స్వాధీనం చేసుకున్న వాహనాలను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. పట ్టణంలో కూడా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కొత్త వ్యక్తులకు ఇల్లు అద్దెకు ఇచ్చేటపుడు వారి వివరాలు తెలుసుకొని ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కొత్త వ్యక్తులకు ఆశ్రయం కల్పించ వద్దని, సరైన పత్రాలు లేని వాహనాలు,కార్లు తక్కువ రేటుకు వస్తాయని కొను గోలు చేయవద్దని సూచించారు. వాటికి సంబంధించిన పత్రాలను పూ ర్తిగా పరిశీలించి అవసర మైతే సం బంధిత అధికారులను సంప్రదించి కొ నుగోలు చేయాలని చెప్పారు.





ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

పట్టణంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. డిఎస్పీ బి.ఆదినారాయణ నేతృత్వంలో పోలీసులు ఆదివారం తెల్లవారుజామున కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పట్టణంలోని పలు లాడ్జిల పై పోలీసులు మెరుపు దాడులు చేశారు. రంగా కాలనీ లో పలు గహాలపై దాడులు చేశారు. ఎలాంటి పత్రాలు లేని 11 ద్విచక్ర వాహనాలు రెండు ఆటోలను పోలీసులు సీజ్ చేశారు. నర్సరావుపేట రోడ్డు లో ఉన్న లాడ్జి పై దాడి చేసి 6 జంటలను అదుపులోకి తీసుకున్నారు. సబ్ డివిజన్ పరిధిలో ఉన్న 70 మంది పోలీసులు బందాలు గా ఏర్పడి తనిఖీలు చేశారు నిర్వహించారు. నేరాల నియంత్రణలో భాగంగా కార్డన్ సెర్చ్ నిర్వహించిన నట్లు డిఎస్పీ బి ఆదినారయణ తెలిపారు.

'లక్ష మందితో చంద్రబాబును ఆహ్వానించాలి'

ప్రజాశక్తి-అమరావతి

అమరావతిలోని ధనకోటలో జరుగు ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమాన్ని విజయ వంతం చేసేందుకు జన సమీకరణ చేయాలని, లక్ష మందితో చంద్రబాబును ఆహ్వానించాలని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ స్థాయిలో టిడిపి నాయకులు అభిమానులు కార్యకర్తలు భారీ ఎత్తులో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం సభా స్థలిని పరిశీలించారు. చంద్ర బాబు రోడ్ షోను విజయవంతం చేసేందుకు ధరణికోటలోని జేబీ గార్డెన్స్ లో సమావేశం నిర్వహించారు. మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు పాల్గొని నియోజకవర్గ నాయ కులతో భేటీ అయ్యారు. సమావేశంలో పల్నా డు జిల్లా టిడిపి అధ్యక్షులు జీవీ ఆంజ నేయు లు మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు , నక్క ఆనంద్‌బాబు, శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు

మహిళలందరూ తరలిరండి

ప్రజాశక్తి-పెదకూరపాడు

ఈ నెల 25న అమరావతిలో జరిగే ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమానికి భారీ బహిరంగ సభకు రావాలని మహిళా నేతలు ఇంటి ఇంటికి తిరిగి పెదకూరపాడు లో బొట్టు పెట్టి ఆహ్వానిస్తున్నారు. 26న రోడ్ షో, ర్యాలీకు పెదకూరపాడు ప్రజలందరూ మహి ళలు అందరూ తరలిరావాలని టిడిపి నాయకులు కోరారు.

జై భారత్ సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - వినుకొండ

ఈ నెల 24 న విజయవాడలో జరగనున్న జై భారత్ సత్యాగ్రహ దీక్షలో భారీ ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొని రాహుల్ గాంధీకి సంఘీ భావం ప్రకటించాలని వినుకొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్‌కె నాయుడు కోరారు. స్థానికంగా ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధా నాలను ప్రజలకు వివరిస్తామని చెప్పారు. జై భారత్ సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని కోరారు.

పార్క్ ఏర్పాటుకు స్థలం గుర్తించాలి : పల్నాడు కలెక్టర్

ప్రజాశక్తి-నరసరావుపేట

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో ఆహ్లాద వాతావరణం నెలకొల్పేందుకు ప్రశాంత వాతావరణం ఉండే విధంగా పార్కును ఏర్పాటు చేసేందుకు అవసరమైన స్థలాన్ని గుర్తించాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆర్డీఓ ఎం.శేషిరెడ్డి, తహశీల్దార్ ఆర్. వి రమణ నాయక్ లను ఆదివారం ఆదేశించారు.



ఆకట్టుకున్న నాటిక ప్రదర్శనలు

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని లింగారావుపాలెంలో కొండవీటి కళా పరిషత్ 24వ జాతీయస్థాయి ఆహ్వాన నాటికల పోటీలు రెండో రోజు శనివారం జరిగాయి. శ్రీఅనంతలక్ష్మీ నూలుమిల్లు ఎండి సామినేని ఫణి కుమార్, విరించి రిసార్ట్స్ అధినేత నెల్లూరు వంశీకృష్ణ జ్యోతిప్రజ్వలన చేశారు. గ్రామ ఎంపిటిసి తోకల రాఘవయ్య పోటీలను ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో వారు మాట్లాడుతూ పరిషత్‌లు కళామతల్లికి, కళాకారులకు వెన్నెముకగా ఉంటూ, నాటక రంగానికి జవసత్వాలు అందిస్తున్నాయని అన్నారు. నాటక రంగం అభ్యున్నతికి కృషి చేస్తున్న పరిషత్‌లను కళాపోష కులు, దాతలు ఇతోధికంగా సహాయ సహ కారాలు అందించాల్సిన అవ సరం ఉందన్నారు. పరిషత్‌ల నిర్వహణలో తమవంతు సహకారం తప్పక అందిస్తామని చెప్పారు. పరిషత్ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పఠాన్ జువెలర్స్ పఠాన్ సుభాని, తక్కెళ్ల పాడుకు చెందిన ఎం. కాళిదాసు, గుంటూరు ఎన్‌టిఆర్ కళాపరిషత్ కార్యదర్శి కె.రామకృష్ణప్రసాద్, ఎం.రవీంద్రబాబు, పి.శివరామ కృష్ణయ్య, పరిషత్ నిర్వాహకులు ప్రసంగించిన వారిలో ఉన్నారు. 'చీకటిపువ్వు', 'రైతేరాజు', 'స్థిరాస్తి' నాటికలు ప్రదర్శించారు. ఆయా నాటికలు ఆహు తులను అలరించడంతో పాటు ఆలోచింపజేశాయి.

ఎంపిహెచ్ఎల నియామకం

ప్రజాశక్తి - రెంటచింతల

మండల కేంద్రమైన రెంటచింతలలోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు ఎంపిహెచ్‌ఎలు (పురుషులు) నియామకం జరిగినట్లు వైద్యాధికారి డాక్టర్ కృష్ణారెడ్డి తెలిపారు. ఎంపిహెచ్‌ఎలు కాసిం, సీతారెడ్డిలు ఆదివారం బాధ్యతలు చేపట్టారని అన్నారు. నెలరోజులుగా 207 మందికి కరోనా పరీక్షలు నిర్వహించామని, ఒక్కరికి కూడా వ్యాధి నిర్ధారణ కాలేదని చెప్పారు. ముందు జాగ్రత్త చర్య గా ప్రతి ఒక్కరూ మాస్కులు తప్పనిసరిగా ధరించడంతో పాటు దూరం పాటించాలని సూచించారు.

భార్యపై కత్తితో దాడి

ప్రజాశక్తి-ఈపూరు

భార్యపై భర్త కత్తితో దాడి చేసిన ఘటన మండల కేంద్రమైన ఈపూరు లో ఆదివారం జరిగింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కన్నేబోయిన శ్రీనివాసరావు ఆస్తి విషయంలో భార్య మంగమ్మ తో ఘర్షణ పడ్డాడు.ఈ క్రమంలో కత్తితో ఆమెపై దాడి చేసి గాయ పరిచాడు..కుటుంబ సభ్యులు మంగమ్మను చికిత్స నిమిత్తం ఈపూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విప్పర్ల వెంకటరావు తెలిపారు.



సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

ప్రజాశక్తి - బెల్లంకొండ

మండల కేంద్రమైన బెల్లంకొండకు చెందిన జువ్వాజీ ప్రవీణ్ కు రూ.45,000, క్రోసూరు మండలం నాగవరానికి చెందిన వల్లాల పిచ్చమ్మకు రూ.30,000 ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పంపిణీ చేశారు. గుంటూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. అనారోగ్యంతో బాధపడే వారు, వైద్యానికి ఖర్చు పెట్టే స్తోమత లేని వారికి సాయం కోసం ముఖ్యమంత్రి సహాయనిధిని ఆశ్రయించవచ్చని సూచించారు.



బోధనా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పట్టణంలోని 18 వ వార్డులోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాల (శారద) స్కూల్‌లో గోరంట్ల దాసయ్య - శేషారత్నం వారి జ్ఞాపకార్థం ఎన్ఆర్ఐ డాక్టర్ గోరంట్ల వాసు బాబు ఆదివారం బోధనా సామగ్రిని అందజేశారు. ముఖ్యఅతిథి మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని మాట్లాడుతు ప్రస్తుతం ఇటువంటి కార్యక్రమాలు చేయడం వల్ల మంచి పేరుతో పాటు, స్కూల్ లోని ఉపాధ్యాయులకు,విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. మండల విద్యాశాఖ అధికారి కె.లక్ష్మి, ఒయాసిస్ సంస్థ అధ్యక్షురాలు కె.జయమ్మ, రోటరీ క్లబ్ అధ్య క్షులు టి.అంజిరెడ్డి, పి రాఘవయ్య, ఎన్.రాజ్యలక్ష్మి, ఎన్. అరుణకుమారి, సయ్యద్ రుబీన, ఎన్ .రాజేశ్వరి, ఎం. కోటేశ్వరి, విజయశ్రీ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణములోని 2-టౌన్ పరిధిలో విద్యుత్ లైనులు మరమ్మతులు కారణంగా సోమవారం సుభాని నగర్, రాగన్నపాలెం ప్రాంతాలకు ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడు నని డి.ఈ.ఈ. ఆర్. అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు.



ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్షలు

ప్రజాశక్తి-విజయపురిసౌత్

విజయపురి సంస్థలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలో ఆదివారం జరిగిన ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 10 గంటలకు ఐదవ తరగతిలో చేరేందుకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 12 గంటలకు, మొదటి సంవత్సరం ఇం టర్మీడియట్‌లో చేరేందుకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమై సాయంత్రం నాలుగు గంటలకు ముగిసింది. ఐదవ తర గతిలో చేరేందుకు మొత్తం 231 మంది దరఖాస్తు చేసుకోగా 252 మంది ప్రవేశ పరీక్షకు హాజరయ్యారు, అలాగే ,మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్‌లో చేరేందుకు 25 మంది దరఖాస్తు చేసుకోగా 1703 మంది విద్యార్థినిలు పరీక్షకు హాజరయ్యారు, పరీక్షలను కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీరాజ్యం, వైస్ ప్రిన్సిపాల్ దారా మేరీ మంజుల ఆధ్వర్యంలో నిర్వహించారు పరివేక్షణకు నాగజ్యోతి ఉన్నారు.



పమిడిపాడు బ్రాంచ్ కెనాల్‌పై రైతుల రాస్తారోకో

ప్రజాశక్తి - నూజెండ్ల

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో మండలంలోని పమిడిపాడు బ్రాంచ్ కెనాల్‌పై ఆదివారం రాస్తారోకో నిర్వహించారు. నాగార్జునసాగర్ కుడి కాలువ జోన్ 2 పరిధిలో పమిడిపాడు బ్రాంచ్ కెనాల్ పరిధిలో వేలాది ఎక రాల్లో వరి, మొక్కజొన్నతో పాటు అనేక పైర్లు నీళ్లు లేక ఎండిపోతున్నాయని అక్కడి రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము మాట్లాడుతూ ఈ విషయమై కలెక్టర్‌కు ఇటీవల వినతిపత్రం అందజేశామని, పరిశీలించి సాగునీరు ఇస్తామని ఆయన చెప్పారని అన్నారు. అయితే, పం టలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తుండటంతో గత్యంతరం లేక రాస్తారోకో నిర్వహించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ ఎస్సీతో ఫోన్‌లో మాట్లాడమని, రెండు రోజుల సమయం ఇవ్వాలని, ఇబ్బంది లేకుండా చూస్తానని వారు చెప్పడంతో రాస్తారోకో విరమించినట్లు చెప్పారు. చెప్పిన మాట ప్రకారం సాగునీరు ఇవ్వకపోతే నిరవధికంగా రహదారి నిర్బంధం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు..



ఉన్నవలో చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని ఉన్నవలో జనసేన పార్టీ నాయకులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి తోట రాజ రమేష్ ఆదివారం ప్రారం భించారు. కార్యక్రమంలో మండల జనసేన అధ్యక్షులు జి.వెంకట్రావు, పఠాన్ ఖాదర్ బాషా, మండల ఉపాధ్యక్షులు మల్లాకోటి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యవాదులందరూ ఏకం కావాలి

- అంబేద్కర్‌కు విగ్రహాలు కాదు.. రాజ్యాంగాన్ని గౌరవించండి
- సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్
- పల్నాడు జిల్లాలో కొనసాగుతున్న సిపిఎం, సిపిఐ ప్రచారభేరి



మాచర్లలో మాట్లాడుతున్న సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్

ప్రజాశక్తి - మాచర్ల

దేశ పరిస్థితులకు అనుకూలంగా భిన్న వర్గాలు, విభిన్న మతాల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని బిజెపి నేతలు మార్చేస్తున్నారని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ విమర్శించారు. రామాలయం సెంటర్‌లో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ విధా నాలను నిరసిస్తూ జరుగుతున్న ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆదివారం సద స్సు జరిగింది, ముఖ్యఅతిథిగా పాల్గొన్న విజయ్‌కుమార్ మాట్లాడుతూ అంబేద్కర్‌కు పెద్దపెద్ద విగ్రహాలు పెడుతున్నారని, ఆయన జయంతి, వర్ధంతులకు పూల మాలలు వేసి గౌరవిస్తున్నారే తప్ప ఆయన రాసిన రాజ్యాంగాన్ని అమలు చేయడం లేదని విమర్శించారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి ప్రజాస్వామ్యవాదులం దరూ ఏకం కావాల్సిన అవసరం ఉంద న్నారు. మోడీ ప్రభుత్వం పచ్చి ప్రజా వ్యతి రేక విధానాలను అవలంబిస్తోందని, అధి కారం లోకి రావడానికి ఆయనకు పెట్టుబడి పెట్టిన పెట్టుబడిదారులను, అధికారం వచ్చాక ఆయన పెంచి పోషిస్తున్నారని విమర్శించారు గుజరాత్‌లోని బడా పారిశ్రామికవేత్తల బాధలు తప్ప, ప్రజల బాధలు ఆయనకు పట్టడం లేదని అన్నారు. నిరుద్యోగం పెరిగిపోయింది, నిత్యావసర సరుకుల నుంచి అన్ని ధరలు పెరిగిపోయాయని, దీంతో, సాధారణ ప్రజల జీవితాలు చిన్నాభిన్నమవుతున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి ఇవేమీ పట్టడం లేదని విమర్శించారు. రాష్ట్రంలోని ప్రధాన రాజకీయపార్టీలు కేంద్రాన్ని పల్లెత్తు మాట అనలేకపోతున్నాయని, మోడీ సేవలో తరిస్తున్నాయని విమ ర్శిం చారు. రాష్ట్రానికి తీరని అన్యాయం మోడీ హయాంలోనే జరిగిందని, విభజన హామీల్లో ఏ ఒక్కటీ అమలు కాలేదని అన్నారు. మరో ముఖ్యఅతిథి సిపిఐ గుం టూరు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ మాట్లాడుతూ రైతు సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తాం, నల్లడబ్బు తీసుకొస్తాం అన్న మోడీ, డబ్బు ఉన్నవాళ్ళ అనుచరు లకు దోచిపెడుతున్నాడని విమర్శించారు. పాలనలో అవినీతి,అక్రమాలు పెరిగిపోయాయని, కార్మిక వర్గాన్ని మోడీ సర్కారు తీవ్రంగా దెబ్బతీస్తోందని అన్నారు. సిపిఎం,సిపిఐ జిల్లా నాయకులు ఆంజనేయులు నాయక్, ఎస్కే హుస్సేన్ లు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలన్నీ అయిన కాడికి అమ్మకానికి పెడుతున్నారని, రాబోయే కాలంలో యువతకు ఉద్యోగావకాశాలు లేకుండా చేస్తున్నారని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు మోడీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపేందుకు కదలి రావాలని కోరారు. రాజకీయ అవసరాల కోసం చాలా పార్టీలు మోడీకి వత్తాసు పలుకు తున్నాయని, ప్రజల్లో చైతన్యం వస్తే తప్ప ప్రజాస్వామ్యం నిలబడదని అన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బండ్ల మహేష్ ఎన్.లక్ష్మయ్య వై.సురేష్ బాబు రావు, వి.వెంకట్రావు, శోభన్‌కుమార్, ఎస్ ఎఫ్ఐ నాయకులు రాజు, ఆదిత్య పాల్గొన్నారు



సత్తెనపల్లిలో

బిజెపి ప్రభుత్వానికి చరమగీతం పాడదాం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

కార్మిక కర్షక వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి చమర గీతం పాడుదాం అని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ అన్నారు. సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన రాజకీయ ప్రచార బేరి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్రంలోని ప్రజా వ్యతిరేక ప్రభు త్వానికి రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు వత్తాసు పలుకుతున్నాయని , ఈ పార్టీ లన్నిటికి తగిన బుద్ధి చెప్పాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని అన్నారు. ఇటువంటి పరి స్థితులలో కార్మిక,రైతు వ్యతిరేక బిజెపి ప్రభుత్వాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ కొనసాగ నివ్వకూడదని అన్నారు. సిపిఎం పట్టణ కార్యదర్శి ధరణికోట విమల, సిపిఐ నియోజకవర్గ నాయకులు నరిసేటి వేణుగోపాల్ లు మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలు,చెత్త పన్ను, ఆస్తి పన్నుల పేరుతో ప్రజలపై మోయలేని భారాలను మోపుతోందని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎ.వీం బ్రహ్మం, కె.శివదుర్గారావు, ఎ.ప్రసాద్ రావు, ఎం.జగన్నాథ రావు,ఎం. హరిపోతు రాజు, అనంత వెంకట్ నారాయణ, జె.రాజ కుమార్, ఆర్. పురుషోత్తం, సిపిఐ నాయకులు ఇర్మియ పాల్గొన్నారు.



నరసరావుపేటలో నిర్వహిస్తున్న ప్రచారభేరి

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టండి

ప్రజాశక్తి-నరసరావుపేట

కేంద్రంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విదానాలను తిప్పికొట్టేందుకు ప్రజలంతా ఐక్యం కావాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు పిలుపు నిచ్చారు. బిజెపి ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ సిపిఎం సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార భేరి కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక చిత్రాలయాసెంటర్ లో ప్రారంభించారు. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ గత తొమ్మిదేళ్లుగా దేశంలో బిజెపి పాలన సాగుతోందని, ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు కాలేదని విమర్శించారు. ప్రజా సమస్యలను విస్మరించి దేశ సంపదను కార్పొరేట్ శక్తులు కట్టబెట్టేందుకు బిజెపి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను ప్రచారభేరి ద్వారా ప్రజల్లో చైతన్యం నింపుతు న్నామన్నారు. చిత్రలయ సెంటర్లో ప్రదర్శన అనంతరం నరసరావుపేట మండలంలోని అగ్రహారం, పమిడిపాడు, కేసనపల్లి, దొండపాడు, కాకాని, ఎలమంద ,గురవాయిపాలెం , అచ్చమ్మపాలెం,నకరికల్లు, మండల కేంద్రం రొంపిచర్ల, మండలంలోని మాచవరం సంతగుడిపాడు వీరాటం రైతు నగర్ అనంతరం కోటప్పకొండ రోడ్డు లోని పల్నాడు విజ్ఞాన కేంద్రం వరకు ప్రచార జాత ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు డి శివ కుమారి, తాళ్లూరి పెద్దిరాజు,సిపిఎం నరసరావుపేట పట్టణ కార్యదర్శి సిలార్ మసూద్, కొమ్మల నాగేశ్వరరావు, ఇశ్రాయేలు, సుభాని,సిపిఐ పట్టణ కార్యదర్శి వైదన వెంకట్, రాజు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ప్రజా వ్యతిరేక,నిరంకుశ, మతోన్మాదం బిజెపి పాలనను అంత మొందించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి పేరుబోయిన వెంకటేశ్వర్లు, సిపిఐ నియోజకవర్గ సమితి కార్యదర్శి నాగబైరు సుబ్బాయమ్మ పిలుపు నిచ్చారు. స్థానిక ఎన్ఆర్‌టి సెంటరులోని సిపిఐ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఐ, సిపిఎం అధ్వర్యంలో ఈ నెల 25వ తేదీన సాయంత్రం ఆరు గంటలకు కళా మందిర్ సెంటర్‌లో జరిగే బహిరంగసభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సాతులూరి బాబు, ఎం.విల్సన్, సిపిఐ నాయకులు నాయుడు శివ, పెలూరీ రామారావు, చెరుకుపల్లి విజయ నిర్మల తదితరులు పాల్గొన్నారు.



చిలకలూరిపేటలోని సిపిఐ కార్యాలయంలో కరపత్రాల ఆవిష్కరణ

ప్రజాశక్తి-రొంపిచర్ల

మండలంలోని మండలంలో సంతగుడిపాడు, రొంపిచర్ల, మాచవరం, వడ్లమూడివారిపాలెం, విప్పర్లపల్లి, మునమాక గ్రామాల్లో ప్రచారభేరి కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరాజు, సిపిఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి కె.రాంబాబు, నరసరావుపేట పట్టణ కార్యదర్శి వి.వెంకట్, నాయకులు పి.హుస్సేన్, హర్ష, సిపిఎం నాయకులు పెద్దిరాజు, కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.



రొంపిచర్ల మండలంలో..


గుంటూరు నెహ్రూ నగర్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు, కార్యకర్తలు


గుంటూరు స్వర్ణభారతి నగర్‌లో ప్రచారం చేస్తున్న శ్రేణులు



తాడేపల్లిలో ప్రచారం చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

మోడీని గద్దె దింపితేనే దేశానికి భవిష్యత్

ప్రజాశక్తి-గుంటూరు

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సిపియం, సిపిఐ చేపట్టిన ప్రచార భేరి కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక నెహ్రూ నగర్‌లో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సిపియం, సిపిఐ నగర కార్యదర్శులు కె.నళినీకాంత్, కె.మాల్యాద్రి ప్రసంగించారు. నాయకులు కె.శ్రీనివాస్, బి.ముత్యాలరావు, ఆది నికల్సన్, ఖాసింవలి, రామచంద్రుడు, దాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక 41వ డివిజన్‌లోని రామాంజనేయ కాలనీ, రాజీవ్ గృహకల్ప అపార్ట్‌మెంట్స్, రాయపాటి శ్రీనివాస్ కాలనీ, పుచ్చలపల్లి సుందరయ్య నగర్ తదితర ప్రాంతాల్లో సిపియం నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ నెల 25వ తేదీన సాయంత్రం 6 గంటలకు స్వర్ణభారతి నగర్, కొత్తరోడ్డు, అంబేద్కర్ సెంటర్ వద్ద బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. ప్రచార కార్యక్రమంలో సిపిఎం పార్టీ నగర నాయకులు షేక్ ఖాశిం షహీద్, షేక్ మస్తాన్ వలి, పుచ్చలపల్లి సుందరయ్య నగర్ శాఖ కార్యదర్శి కామిశెట్టి ఆంజనేయులు, సభ్యులు జి.లూథర్ పాల్, నాయుడు పద్మ, అచ్యుత కుమారి, డి మల్లేశ్వరి, ముస్తాక్ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి:రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసి విభజన హామీలు అమలు చేయని బిజెపి ఒక్కరోజు కూడా అధికారంలో ఉండటానికి వీల్లేదని సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు విమర్శించారు. రాజధాని ముఖద్వారమైన ఉండవల్లిలో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ప్రచారభేరి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి మాట్లాడుతూ అబద్దాలతో ప్రజలను నమ్మించేందుకు మోడీ పడరాని పాట్లు పడుతున్నారని ఎద్దేవా చేశారు. మోడీకి వ్యతిరేకంగా మాట్లాడిన వారిపై సిబిఐ, ఇడి వంటి దర్యాప్తు సంస్థలను వినియోగిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వి.వెంకటేశ్వరరావు, ఎం.భాగ్యరాజు, వి.రామారావు, ఎస్‌కె పీరూసాహెబ్, కె.జగదీశ్వరరెడ్డి, పార్ధసారధి, గాంధీ, శివయ్య, ఎస్.వెంకటనారాయణ, మస్తానరావు, సిపిఐ నాయకులు వెంకటయ్య, సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొల్లిపర :కేంద్ర ప్రభుత్వం రైతాంగ వ్యతిరేక విధానాల వ్యతిరేకిస్తూ బిజెపి ప్రభుత్వం గద్దె దిగే వరకు పోరాడాలని సిపిఎం సీనియర్ నాయకులు ములక శివసాంబిరెడ్డి అన్నారు. ఆదివారం మున్నంగి ,వల్లభాపురం గ్రామాల్లో సిపిఎం నాయకులు ప్రచార భేరి నిర్వహించారు. కార్యక్రమంలో శివసాంబిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతాంగ వ్యతిరేక విధానాల వలన రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించక పెట్టిన పెట్టుబడులు రాక రైతులు, కౌలు రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. కార్పొరేట్ శక్తులైన అంబానీ ఆదానీలకు దేశ సంపద దోచిపెడుతున్నారని కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మర్దన సాంబశివరావు అరగబోసిరెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.**పెదకాకాని**:పెదకాకానిలో ఆదివారం సిపిఎం ప్రజాసంఘాల ఆద్యరంలో ప్రజా వ్యతిరేక నిరంకుశ మతోన్మాద బిజెపిని సాగనంపుదాం దేశాన్ని కాపాడుకుందాం అని ప్రచార బేరి కార్యక్రమంలో భాగంగా పెదకాకాని సుందరయ్య కాలనీలో ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, ప్రతి వ్యక్తి గొంతెత్తి కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలను నిలదీయాల్సిన సమయం వచ్చిందన్నారు. మోడి, అమిత్ షా నాయకత్వంలో బిజెపి, ఆర్ఎస్ఎస్ కూటమిలు అన్నదమ్ములా కలిసి మెలిసి ఉండాల్సిన ప్రజల మధ్య మత చిచ్చు రాజేస్తుందన్నారు. ధరలు విపరీతంగా పెరిగాయని, నిరుద్యోగం పెరిగిందని ఉండ పరిశ్రమలు మూతపడుతున్నాయని ప్రజల పైన జీఎస్టీ పేరుతో పన్నులు భారాలు వేశారని బిజెపి ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు పెద్ద ఎత్తున పోరాటాలు చేసి విశాఖ స్టీల్ ప్లాంట్‌ని కాపాడుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎ. బాబురావు, బురదగుంట సాంబయ్య ,ఆముదాల నాగేశ్వరరావు, షేక్ అనార్బి,విజయలక్ష్మి పి జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.**తాడేపల్లి రూరల్:** కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సోమవారం మంగళగిరిలో జరుగు బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం, సిపిఐ శ్రేణులు ఆదివారం రాత్రి ఎంటీఎంసీ పరిధిలోని చిర్రావూరులో కరపత్రాలు పంచుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు మాట్లాడుతూ నరేంద్ర మోడీ నాయకత్వంలో బిజెపి నిరంకుశ పాలన చేస్తుందని ఆయన అన్నారు. మతోన్మాదాన్ని మనువాదాన్ని ప్రజలపై అమలు చేసేందుకు పూనుకోవడం దుర్మార్గమని ఆయన అన్నారు. బిజెపి ప్రభుత్వాన్ని అన్ని వర్గాల ప్రజలు వ్యతిరేకిస్తున్నారని సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి అన్నారు. పెద్ద నోట్ల రద్దు తోను, జీఎస్టీని అమలు చేసి ఆర్థిక రంగాన్ని అధోగతి పాలు చేసిన నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని సాగనంపాలని అన్నారు. . సోమవారం సిపిఎం సిపిఐ పార్టీల ఆధ్వర్యంలో మంగళగిరిలో జరుగు బహిరంగ సభలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ తాడేపల్లి మండల కార్యదర్శి ముసునూరు సుహాస్, సిపిఎం చిర్రావూరు గ్రామ నాయకులు మేడూరి పాములు, పరిమిశెట్టి శివ నాగేశ్వరరావు, పల్లపాటి సుబ్బారావు, తోట కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


కొల్లిపర మండలంలో కరపత్రాలు పంచుతున్న నాయకులు


తాడేపల్లి మండలం చిర్రావూరులో కరపత్రాలు పంచుతున్న నాయకులు


నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు , తదితరులు

సిపిఎం అభిమాని సీతామహాలక్ష్మి మృతి

ప్రజాశక్తి-గుంటూరు

సిపిఎం అభిమాని, ఐద్వా 41వ వార్డు నాయకులు కురగుంటి సీతామహాలక్ష్మీ అనారోగ్యంతో ఆదివారం మరణించారు. సీతామహాలక్ష్మీ భౌతికకాయాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.భావన్నారాయణ, నగర కార్యదర్శివర్గ సభ్యులు బి. ముత్యాలరావు, జిల్లా కమిటీ సభ్యులు బి.లక్ష్మణరావు, నగర కమిటీ సభ్యులు షేక్.ఖాశిం షహీద్, షేక్.ఖాశింవలి, పుచ్చలపల్లి సుందరయ్య నగర్ శాఖ కార్యదర్శి కె.ఆంజనేయులు, కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు షేక్.మస్తాన్‌వలి, ఆది నికల్సన్, సభ్యులు ఎస్.పద్మనాభుడు, లూథర్ పాల్, ఐద్వా సభ్యులు నాయుడుపద్మ, అచ్యుత కుమారి తదితరులు నివాళులర్పించి, సంతాపం తెలియజేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా భావనారాయణ మాట్లాడుతూ కురగంటి సీతామహాలక్ష్మి 2007లో పేదలకు ఇళ్ల స్థలాలు కల్పించాలని సిపిఎం తలపెట్టిన భూ పోరాటంలో చాలా చురుకుగా పాల్గొన్నారని, ఆ పోరాటంలో అరెస్ట్ కూడా అయ్యారన్నారు. మహిళా సంఘంలో అనేక పోరాటాలు, ఆందోళనలలో పాల్గొన్నారని అన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వేముల దుర్గారావు

మేడేను ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-తాడేపల్లి

మేడే రోజున తాడేపల్లిలో వాడవాడలా అరుణ పతాకాలు ఎగురవేయాలని, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు కోరారు. ఆదివారం ప్రకాష్‌నగర్‌లోని సిఐటియు కార్యాలయంలో ఇసుకపల్లి ఇస్సాకు అధ్యక్షతన నిర్వహించిన సిఐటియు పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మిక హక్కులను హరించి వేసిందన్నారు. ఎనిమిది గంటల పని విధానానికి బదులు 12 గంటల పని విధానాన్ని తీసుకొచ్చి కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని మండిపడ్డారు. మేడే రోజున పతాకావిష్కరణలతో పాటు కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయాలని కోరారు. అలాగే 24వ తేదీ సోమవారం సాయంత్రం ఐదు గంటలకు మంగళగిరి ఆటోనగర్ వద్ద సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో జరిగే బహిరంగ సభకు పట్టణంలోని భవన నిర్మాణ కార్మికులు, ఆటో, గృహ కార్మికులు, స్కీమ్ వర్కర్లు తరలిరావాలని సమావేశంలో బూరుగ వెంకటేశ్వర్లు, కొట్టె కరుణాకరరావు, ఎ.శౌరిబర్తులం, వి.ప్రదీప్, వెంగమ్మ పాల్గొన్నారు.

జాతీయ సాహిత్య పురస్కారానికి ఆళ్ల ఎంపిక

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలికి చెందిన ఆర్టీసీ కండక్టర్, కవి, రచయిత ఆళ్ల నాగేశ్వరరావుకు జాతీయ సాహిత్య సంబరాల నుంచి ఆహ్వానం లభించింది. ఈ నెల 30న హైదరాబాద్‌లోని పఠాన్ చెరు తెలుగు వెలుగు సాహిత్య వేదిక ఎస్వీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమానికి హాజరు కమ్మని ఆ సంస్థ జాతీయ ప్రధాన కార్యదర్శి మోటూరి నారాయణరావు ఆళ్లకు ఆదివారం వ్యక్తిగత ఆహ్వాన పత్రికను పంపారు. సంస్థ నిర్వహించిన ఉగాది సాహితీ సభరాల సంకలనంలో ఆళ్ల నాగేశ్వరరావు పంపిన కవిత ఎంపికైనందుకు జాతీయ సాహిత్య పురస్కారంతో పాటు బిరుదు ప్రధానం చేయనున్నట్లు ఆహ్వానమందించి. పురష్కారంతో పాటు తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ధ్రువపత్రాలు ప్రదానం జరుగుతుందని ఆహ్వానం అందుకున్నారు. పురస్కారం స్వీకరించి జాతీయ సాహితీ సంబరాలను విజయవంతం చేయాలని ఆళ్ల నాగేశ్వరరావును సంస్థ నిర్వాహకులు కోరారు.


ఆళ్ల నాగేశ్వరరావు

డ్రెయినేజీ సమన్యను పరిష్కరించండి..

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని మహానాడు 9వ రోడ్డులో డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని స్థానికులు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు. డ్రెయినేజీలు పొంగిపొర్లి రోడ్ల మీదకు మురుగు వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భరించలేదని దుర్గంధంతో ఇళ్లల్లో ఉండలేకపోతున్నామని వాపోతున్నారు. డ్రెయినేజీలు పొంగిపొర్లడంతో రోడ్లు అధ్వానంగా మారాయని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అనేక సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కావడంలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దోమల ఉధృతితో పాటు అంటురోగాలు ప్రబలుతాయోమోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకుని మురుగు సమస్యను పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.


కాల్వలో పొంగిపోతున్న మురుగు



రైతులకు అవగాహన కల్పిస్తున్న శ్రీదేవి

పంట మార్పిడితో అధిక దిగుబడి

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

పంట మార్పిడితో రైతులంతా అధిక దిగుబడులను సాధించుకోవచ్చని ఇంటర్నల్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ శ్రీదేవి తెలిపారు. ఆదివారం ఎంటిఎంసీ పరిధిలోని కుంచనపల్లిలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ రైతులు ఏటా ఒకే రకమైన పంటలను సాగు చేయకుండా, పంట మార్పిడి విధానాలను అవలంబించి, సాగులో అధిక దిగుబడులు సాధించాలని ఆమె సూచించారు. అదేవిధంగా వేసవిలో పంట పొలాలలో నవధాన్యాల సాగు ద్వారా భూమిలో సారవంతం పెరగడంతో పాటు, రైతులకు లాభాలు వస్తాయని అన్నారు. పంట పూర్తయిన తర్వాత భూమిలో కలియ దున్నడం వల్ల జీవవైవిధ్యం పెరిగి, రానున్న ఖరీఫ్ సీజన్లో అధిక దిగుబడులు సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రతి రైతు వేసవిలో పంట పొలాన్ని ఖాళీగా ఉంచకుండా నవధాన్యాల సాగు చేయాలని ఆమె సూచించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు రైతులు, యూనిట్ ఇంచార్జ్ శ్రీదేవి, ఐసిఆర్‌పిలు సుశీల, హైమావతి, ఐబిఐసి ఆర్ పి సువర్ణ పాల్గొన్నారు.

బ్లడ్‌బ్యాంక్ పనుల పరిశీలన


రక్త సేకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శివశంకర్

ప్రజాశక్తి-నరసరావుపేట

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పల్నాడు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నరసరావుపేట ఏరియా హాస్పిటల్‌లో ఏర్పాటు చేయనున్న బ్లడ్ బ్యాంక్‌ను ఆదివారం కలెక్టర్ శివశంకర్ లోతేటి సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుకు కొన్ని నెలల క్రితం అంకురార్పణ చేశామని, దానికి సంబంధించిన పనులు ఏ స్థాయి వరకు వచ్చాయి, బ్లడ్ బ్యాంకును ఎప్పుడు ప్రారంభించవచ్చని అనే అంశాల పరిశీలన నిమిత్తం సందర్శించి నట్లు చెప్పారు. 400 యూనిట్లు నిల్వ సామర్థ్యం కలిగిన బ్లడ్ సెంటర్ అందు బాటులోకి రానుందని, దీని ద్వారా జిల్లాలో రక్త కొరతను తగ్గించవచ్చన్నారు. ప్రత్యేకంగా న్యూఢిల్లీ రెడ్ క్రాస్ రూ.4 కోట్ల విలువచేసే బ్లడ్ బ్యాంక్ ఎక్విప్‌మెంట్‌ను అందించిందని అన్నారు. స్థానికంగా రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ కంజుల జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు విరాళాలు సేకరించి వాటితో 75 శాతం బ్లడ్ బ్యాంక్ పనులను పూర్తి చేశారన్నారు. ఎయిర్ కండిషనర్, జనరేటర్, ఫర్నీచర్, కొంత ఎలక్ట్రికల్ వర్క్‌కు సంబం ధించిన పనులు పెండింగ్ ఉన్నాయన్నారు. ఈ పనులు పూర్తి చేయడానికి రూ.20 లక్షలు నిధులు అవసరం ఉందన్నారు. దీని నిర్మాణం కోసం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తమ వంతు కృషి చేశారని, రాజ్యసభ సభ్యులు అయోధ్య రామిరెడ్డి, ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయలు చెరో రూ.5 లక్షల చొప్పున మంజూరు చేశారన్నారు. అనంతరం విరాళాలు అందించిన దాతలను కలెక్టర్ సన్మానించారు. కంజుల జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ బ్లడ్ బ్యాంక్ కేవలం నరసరావుపేటకే పరిమితం కాదని జిల్లాలో ఉన్న అన్ని మండలాలకు ఉపయోగపడుతుందనే ఆశా భావం వ్యక్తం చేశారు. జిల్లా మంత్రులు విడదల రజిని, అంబటి రాంబాబు, ఎమ్మెల్యేలు బొల్లా బ్రహ్మనాయుడు పిన్నెల్లి రామ కృష్ణారెడ్డి, కాసు మహేష్ రెడ్డి,నంబూరి శంకర రావులు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా కోశాధికారి గంధ్రకోట మురళీకృష్ణ, డిసిహెచ్ఎస్ రంగారావు, బి.మురళి, కెఎంఎం వి.శ్రీనివాసగుప్తా, జి.వీరారెడ్డి, దంత వైద్య నిపుణులు మేనేజింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ రహంతుల్లా, ఎపిఎంఐడిసి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాయక్ పాల్గొన్నారు.

ఏరియా హాస్పిటల్ ఆకస్మిక తనిఖీ

స్థానిక లింగంగుంట్ల వద్ద ఉన్న ఏరియా హాస్పిటల్ లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. అందులో భాగంగా ఆసుపత్రిలోని అన్ని వార్డులను కలియ తిరిగారు. అక్కడ అందిస్తున్న సేవలు గురించి డాక్టర్ల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఆస్పత్రిలో ఉన్న పేషంట్లతో చర్చించి సకాలంలో వైద్య సేవలు అందుతున్నాయా, నర్సులు డాక్టర్లు బాగా స్పందిస్తున్నారా తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో అందిస్తున్న సేవలపై సంతప్తి వ్యక్తం చేసి డాక్టర్లు, సిబ్బందిని అభినందించారు. ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ రంగారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



యడ్లపాడులో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - యడ్లపాడు

యడ్లపాడు అభివృద్ధి కమిటి, లింగారావుపాలెం విజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక పిఆర్ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దాదాపు 250 మంది పేషెంట్లకు బిపి, షుగర్ ట్యాబ్లెట్లను రెండు నెలలకు సరిపడా అందజేశారు. సీనియర్ వైద్యులు ఎల్.మోహన్ భాస్కర్, జూనియర్ వైద్యులు పి.యామిని, ఎస్.లిఖిత, ఎన్.నవ్యశ్రీ పాల్గొని పేషెంట్లకు తగు సూచనలు చేశారు. బిపి, షుగర్ హెచ్చుతగ్గులతో ఇబ్బంది పడుతున్న పేషెంట్లకు వీడియో కన్సల్టేషన్ ద్వారా విజయవాడకు చెందిన డాక్టర్ గోపాలం శివన్నారాయణ తమ సేవలను అందించారు. కార్యక్రమంలో యడ్లపాడు అభివృద్ధి కమిటీ సభ్యులు కె.రామబ్రహ్మం, జి.కిరణ్ కుమార్, పి.శ్రీనివాసరావు, ఎం.వేణుగోపాల్, బి.రాజేష్‌కుమార్, లింగారావుపాలెం విజన్ ఫౌండేషన్ సభ్యులు ఎస్.శ్రీనివాసరావు, ఆర్.సుమన్, కె.రామోజీరావు, ఆర్.సురేష్ పాల్గొన్నారు.



నాగరాజు కుటుంబానికి వైసిపి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - బెల్లంకొండ

మండల కేంద్రంలోని బేడ బుడగ జంగాల కాలనీలో కొంత కాలంగా కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న 35 ఏళ్ల వయసు గల కొత్తురి నాగరాజు ఆదివారం ఉదయం మృతి చెందారు.నాగరాజు మృతదేహాన్ని బెల్లంకొండ వైసిపి నాయకులు గడ్డి పర్తి చిన్నబాబు రావు,షేక్ రహిమాన్, షేక్ బురాన్ బాబు, ముప్పాళ్ళ షేక్ ధ్దుదా మేస్త్రి, పామ్మి శ్రీనివాసరెడ్డి ఊరా బ్రహ్మం, ఊరా యాదగిరి ,గహ సారథి దుగ్గి మోషే, వాలంటీర్ జ్యోతి, గ్రామ సచివాలయం కన్వీనర్ పాకాల పాటి షేక్ మౌలాలిలు సందర్శించి నివాళులర్పించారు. ఆ కుటుం బానికి రూ.15,000 వేలను ఆర్థిక సాయం కింద అందజేశారు.



చర్మకారులకు గొడుగులు పంపిణీ

ప్రజాశక్తి-అమరావతి

అమరావతిలో గొడుగుల పంపిణీ అభినందనీయమని చిరు వ్యాపారులు ఎండ భారీన పడకుండా రక్షణగా జన చైతన్య సమితి ఆధ్వర్యంలో గొడుగుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వ్యవస్థాపక అధ్యక్షులు విజయ్ బెన్ని బాబు మాట్లాడుతూ, ఎండ ఎండ వాన తేడా లేకుండా శ్రమించే శ్రామికుల కోసం ఎల్లవేళలా తమ సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో అనిల్ పాల్గొన్నారు.

గుండెపోటుతో భవన నిర్మాణ కార్మికుడు మృతి

సిఐటియు నివాళి

ప్రజాశక్తి-సత్తెనపల్లి

గుండెపోటుతో భవన నిర్మాణ కార్మికుడు స్థానిక 28వ వార్డులో నివాసముంటున్న భవన నిర్మాణ కార్మికుడు షేక్ జానీ బాషా(45) గుండెపోటుతో ఆదివారం మృతి చెందాడు. మార్బుల్ వర్క్ చేస్తూ జీవన్ సాగిస్తున్నాడు. యథావిధిగా ఆదివారం పనికి వెళ్లేందుకు సిద్ధమైన ఆయనకు గుండెపోటు రావడంతో ఉన్నపళంగా కుప్పకూలిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు జానీబాషాను పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం సిఐటియు పల్నాడు జిల్లా అధ్యక్షులు అవ్వారు ప్రసాద్‌రావు తోటి కార్మి కులతో హుటాహుటిన సంఘటన స్థలానికి వెళ్లారు. బాషా భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా అవ్వారు ప్రసాదరావు మాట్లాడుతూ బాషాకు భార్య,కుమారుడు, కుమార్తె ఉన్నారని చెప్పారు. ఆ కుటుంబానికి జీవనాధారమైన బాషా మృతి చెందడంతో ఆ కుటుంబం వీధిన పడకుండా ప్రభుత్వం జగనన్న బీమా కింద రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందజేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బాషా అంత్యక్రియలు ఆది వారం సాయంత్రం జరిగాయి. నివాళులర్పించిన వారిలోమున్సిపల్ వైస్ చైర్మన్ నాగూర్ మీరాన్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సయ్యద్ పెద్ద కరిముల్ల, సాదిక్,నూర్ మొహిద్దిన్,మౌలాలి ,షేక్ అబ్దుల్ రజాక్, తోటి భవన నిర్మాణ కార్మికులు పాపారావు, ఏడుకొండలు, అలియాస్, మహ బూబ్ సుభాని, నరేష్, జాన్‌బాబు, సాదిక్ తది తరులు ఉన్నారు.





26న చంద్రబాబు రాక

సభావేదిక స్థలాన్ని పరిశీలించిన టిడిపి నేతలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ఈ నెల 26 న సత్తెనపల్లిలో జరిగే ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొనేందుకు టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు రానున్నారు. ఈ నేపథ్యంలో ఇందుకు సంబంధించినసభా వేదిక రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. సత్తెనపల్లి శరభయ్య హైస్కూల్ క్రీడా మైదానాన్ని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు, మాజీ ఎమ్మెల్యే వైవి ఆంజ నేయులు, ప్రోగ్రాం ఇన్‌ఛార్జి మంతెన సత్య నారాయణ రాజు తదితరులు ఆదివారం పరిశీలించారు.

రోడ్ షో, బహిరంగ సభలను విజయవంతం చేయండి

సత్తెనపల్లి లో ఈ నెల 26న జరిగే చంద్రబాబు నాయుడు రోడ్ షో బహి రంగ సభను దిగ్విజయం చేయాలని పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవి ఆంజ నేయులు విజ్ఞప్తి చేశారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి వెంకటేశ్వర గ్రాండ్ కళ్యాణ మంటపం లో సమన్వయ సమావేశం ఆదివారం జరిగింది. ఈసందర్భంగా టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు మాట్లాడుతూ గ్రూపులు పక్కన పెట్టి అందరూ సమిష్టిగా చంద్ర బాబు రోడ్ షోకు ప్రజలు తరలిరావాలని కోరారు. దళితులను అడ్డంపెట్టుకుని రాష్ట్రంలో అలజడులు సృష్టించేందుకు జగన్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. మాజీ మంత్రి పత్తిపాటి పులారావు మాట్లాడుతూ కులాలు మతాలు మధ్యం విద్వేషాలు రెచ్చగొట్టి ఎన్నికల్లో లబ్దిపొందే ఆలోచన చేస్తున్నారని పేర్కొన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గం పై అధిష్టానం త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఆలస్యమైతే గ్రూపులు ఏర్పడి పార్టీ నష్టం జరుగుతుందని సూచిం చారు. మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వైసిపి ఓ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ అనీ అన్నారు.మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు మాట్లాడుతూ సత్తెనపల్లిలో గ్రూపులు లేవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్, తెనాలి శ్రావణ్ కుమార్ మాచర్ల ఇన్చార్జి జూలకంటి బ్రహ్మ రెడ్డి,గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఇన్చార్జి కోవెలమూడి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



పోట్ల సుబ్బారావుకు టిడిపి నివాళి

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సత్తెనపల్లి నియోజకవర్గం తెలుగు దేశం పార్టీ కో -ఆర్డినేటర్ పోట్ల సుబ్బారావు కు సత్తెనపల్లి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు. ఘన నివాళులర్పించారు. స్థానిక ఎన్టీఆర్ భవన్ లో పోట్ల సుబ్బారావు 4 వ వర్ధంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వైవి ఆంజనేయులు, నియోజకవర్గం పరిశీలకులు తాత జయప్రకాష్ నారాయణ, మున్సిపల్ మాజీ చైర్మన్ యెల్లినేడి రామస్వామి మన్నెం శివ నాగ మల్లేశ్వరరావు,రాష్ట్ర ఇన్‌ఛార్జి వందనా దేవి లు పాల్గొని పోట్ల చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ , మండల పార్టీ అధ్యక్షులు కటకం రామకష్ణ,బత్తుల నాగేశ్వరరావు , పల్లపాటి పెద్దిరాజు,ఆళ్ల అమరేశ్వరావు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మొక్కపాటి రామచంద్రరావు,సి పి ఐ నాయకులు నరిశెటి వేణుగోపాల్, మాజీ ఎంపీపీ పచ్చల నాగేశ్వరరావు,క్లస్టర్ ఇన్‌ఛార్జి రావిపాటి దేవేంద్రరావు,పోట్ల ఆంజనేయులు,గద్దె అప్పారావు, మార్కెట్ రాజు, వెంకటరామయ్య పాల్గొన్నారు.

పుస్తకమే.. పిల్లలకు ఇవ్వాల్సిన ఆస్తి

ప్రజాశక్తి - చిలకలూరిపేట

మండల పరిధిలోని వేలూరులోని గుర్రం జాషువా గ్రంథాలయంలో ఆదివారం జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ (గార్డ్స్) ఆధ్వర్యంలో ప్రపంచ పుస్తక దినోత్సవ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథులుగా మాజీ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ దాసరి చిట్టిబాబు, జనవిజ్ఞాన వేదిక పల్నాడు జిల్లా అధ్యక్షులు దార్ల బుజ్జిబాబు హాజరై మాట్లా డారు.పెద్దలు పిల్లలకు ఇవ్వాల్సిన గొప్ప ఆస్తి పుస్తకం అని, పిల్లల పుట్టినరోజు కానుకగా వారికి పుస్తకాలు ఇవ్వాలని సూచించారు. నిర్వహించారు. అనంతరం 100 పుస్త్తకాలను గుర్రం జాషువా గ్రంథాలయానికి బహుకరించారు.

గ్యాస్ బండపై అదనపు ఛార్జీల మోత



- ఒక్కో సిలిండర్‌కు రూ.45 అదనంగా వసూలు
- రూ.1125 కంటే ఎక్కువ తీసుకుంటే చర్యలు : పౌర సరఫరాల శాఖ కమిషనర్

ప్రజాశక్తి-తాడేపల్లి

గృహ వినియోగదారులు వినియోగించే గ్యాస్ బండపై అదనపు ఛార్జీల మోత మోగిపోతుంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ధర ప్రకారం రూ.1125 వసూలు చేయాల్సి ఉండగా రూ.1170 వసూలు చేస్తున్నారు. ఒక్కో గ్యాస్ బండకు రూ.45 అదనంగా వసూలు చేస్తున్నారు. అదనంగా వసూలు చేసిన ఈ డబ్బంతా డెలివరీ బాయ్‌లకు అందడంలేదు. ఆయా గ్యాస్ కంపెనీల యాజమాన్యాలే బొక్కేస్తున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన గ్యాస్ ధరపై అదనపు డబ్బులు వసూలు చేయకూడదని మార్గదర్శకాలు ఉన్నా గ్యాస్ కంపెనీలు ఆ నిబంధనలు పాటించడంలేదు. గ్యాస్ కంపెనీ నుంచి వినియోగదారుని ఇంటికి 5 కిలోమీటర్లలోపు దూరం ఉంటే ఎటువంటి అదనపు ఛార్జీలు వసూలు చేయకూడదని నిబంధనలు చెబుతున్నాయి. ఐదు కిలోమీటర్ల నుంచి 15 కిలోమీటర్ల దూరం వరకు కేవలం రూ.25 మాత్రమే ఛార్జీలు వసూలు చేయాలని స్పష్టంగా హెచ్‌పి గ్యాస్ ఆధారిత సంస్థలు ప్రకటించాయి. 15 కిలోమీటర్లు దాటితే రూ.30 వసూలు చేసుకోవచ్చని స్పష్టంగా కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల్లో ఉంది. కానీ గ్యాస్ కంపెనీలు ఇవేమీ పాటించడంలేదు. తాడేపల్లి మండలంలో ప్రస్తుతం రెండు గ్యాస్ కంపెనీల గ్యాస్ సిలిండర్లు సరఫరా అవుతున్నాయి. కుంచనపల్లిలో ఇటీవల మరో గ్యాస్ ఏజెన్సీని ప్రారంభించాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఈ రెండు గ్యాస్ ఏజెన్సీల పరిధిలో పది కిలోమీటర్లు మించి ఏ గ్రామమూ లేదు. ఐదు కిలోమీటర్ల దూరం తాడేపల్లి, కుంచనపల్లి పరిధిలోకి వస్తాయి. ఈ రెండు చోట్ల ఎటువంటి అదనపు ఛార్జీలు వసూలు చేయడానికి వీల్లేదు. అయినా రూ.45 అదనంగా ఒక్కో సిలిండర్‌కు వసూలు చేస్తున్నారు. నెలకు లక్షల రూపాయలు రవాణా ఛార్జీల పేరుతో గ్యాస్ కంపెనీలు ప్రజల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నాయి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం పై నిబంధనల ప్రకారం అదనపు ఛార్జీలు చెల్లించాల్సిన అవసరంలేదని కీలక ఉత్తర్వులు జారీ చేసినట్లు మీడియాలో ప్రకటనలు వెలవడ్డాయి. అయితే ఇవేమీ ఆచరణకు నోచుకోవడంలేదు. కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత బిజెపి ప్రభుత్వం రూ.400 ఉన్న గ్యాస్ ధరను మూడు రెట్లు పెంచి ప్రస్తుతం రూ.1125కి తీసుకొచ్చింది. గతంలో ధర ఈ విధంగా ఏనాడు పెరగలేదు. కేంద్ర భ్రుత్వ ఆదేశాలతో పౌర సరఫరాల కమిషనర్ గృహ వినియోగదారులు వినియోగిస్తున్న గ్యాస్ ధర రూ.1125 కంటే ఎక్కువ వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చేసిన హెచ్చరిక కార్యరూపం దాలుస్తుందా అనేది ప్రశ్నగా మారింది. డెలీవరీ బాయ్‌లు రవాణా పరిధిలో వినియోగదారులు నివాసం ఉన్నా కూడా అదనంగా వసూలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక నుంచి ఎవరైనా గృహ వినియోగదారుల నుంచి రూ.1125కు మించి వసూలు చేస్తే ఆయిల్ కంపెనీ డిస్ట్రిబ్యూటర్లు, జిల్లా పౌర సరఫరాల అధికారి, సేల్స్ అధికారికి ఫిర్యాదు చేయవచ్చని పౌర సరఫరాల శాఖ కమిషనర్ తెలిపారు. ఇదే అంశాలపై ఎల్‌పిజి వినియోగదారులు టోల్ ఫ్రీ నెంబర్ 1967 ద్వారా ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్లకు ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. అలాగే ఆయిల్ కంపెనీ టోల్ ఫ్రీ నెంబన్ 1800233555కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదులపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ ఓ ప్రకటనలో తెలిపారు.



సిమెంట్ బల్లలు అందజేత

ప్రజాశక్తి- మంగళగిరి

పట్టణ పరిధిలోని టిడ్కో గృహ సముదాయంలో సిమెంట్ బల్లలు కావాలని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు స్థానిక నివాసితులు దరఖాస్తు చేసుకోగా లోకేష్ వెంటనే స్పందించి ఆదివారం సిమెంట్ బల్లలు వేయించారు.. 8 బ్లాక్‌లకు 16 సిమెంట్ బల్లలను గృహాల సముదాయంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గృహ సముదాయ నివాసితులు ఎం. శ్రీనివాసరావు, కే. శ్రీనివాసరావు, ఏ. నాగ అనురాధ, చింత క్రింది విజయమ్మ, కే శివలక్ష్మి, టి. అవినాష్, షేక్ హసీనాలు పాల్గొన్నారు.



వెకంటేశ్వరావును సన్మానిస్తున్న వివిధ రాష్ట్రా ల ప్రతినిధులు

వెంకటేశ్వరావుకు సన్మానం

ప్రజాశక్తి- మంగళగిరి

అఖిల భారత యునైటెడ్ పద్మశాలి సంఘం మహాసభ హైదరాబాదులో ఆదివారం జరిగింది. ఈ మహా సభలో ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంఘం టి.వెంకటేశ్వరావును జాతీయ ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నారు. వివిధ రాష్ట్రాల నుండి 500 మంది ప్రతినిధులు ఈ మహాసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ ఉపాధ్యక్షులుగా ఎన్నికైన టి వెంకటేశ్వరావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత యునైటెడ్ పద్మశాలి సంఘం అధ్యక్షులు ఎం బాబురావు, ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు జె శ్రీనివాసరావు, జి గోరింటాల, శివకుమార్, టీ పట్టాభి తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-తెనాలిరూరల్

పట్టణంలోని 14వవార్డు సచివాలయం వద్ద డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహా ఏర్పాటుకు తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆదివారం భూమిపూజ చేసారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహాన్ని స్థాపించడం ఆనందంగా ఉందన్నారు. యువత అంబేద్కర్ స్ఫూర్తిని పొందాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్పర్సన్ సయ్యద్ ఖాలేద నసీమ్, వైస్ చైర్మన్ మాలేపాటి హరి ప్రసాద్, మన్నవ ప్రభాకర్, కౌన్సిలర్ దాసరి వీర వసంతరావు తదితరులు పాల్గున్నారు. అనంతరం తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో నిర్వహించనున్న అన్నాబత్తుని సత్యనారాయణ స్మారక జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను మార్కెట్ యార్డ్ కమిటీ ఛైర్మెన్ అవుతు సీతా నగేష్ రెడ్డితో కలసి ప్రారంబించి కాసేపు క్రికెట్ ఆడారు.



గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

ప్రజాశక్తి-పెదనందిపాడు

ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా ఆదివారం పెదనందిపాడు శాఖ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్టియు గుంటూరు జిల్లా అధ్యక్షులు గేరా మోహనరావు మాట్లాడుతూ పుస్తక పఠనం వలన మానసిక ఉల్లాసం, ప్రాపంచిక జ్ఞానం కలుగుతుందని ప్రతి ఒక్కరూ పుస్తక పటనాన్ని అలవర్చుకోవాలని కోరారు. గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని వాటిని నిరుద్యోగులు, ఉద్యోగులు, విద్యార్థులు ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ నిర్వహకురాలు పగడాల సుభాషిని సూచించారు. విశ్రాంత ఉపాధ్యాయులు జి. రమేష్, జి. సాయిబాబు, అన్నలదాసు విజయేంద్రరావు, సుబ్బారావు, మంజుల, విద్యార్థులు పాల్గొన్నారు.

కొరియోగ్రాఫర్ మణికంఠకు ఎన్‌టిఆర్ సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్



వక్తలను సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో సినీ మాటలు రచయత బుర్రా సాయి మాధవ్ నిర్వహిస్తున్న ఎన్టీఆర్ శక పురుషుని శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ప్రతి శనివారం, ఆదివారం ఎన్టీఆర్ వ్యక్తిత్వంపై, నటించిన సినిమాలపై, ఆయన రాజకీయ జీవితంపై జరిగే సదస్సును కొత్తపేట పెన్షనర్స్ అసోసియేషన్ హాల్లో శనివారం నిర్వహించారు. ఉత్సవాల్లో రోజుకొక కళాకారులను సన్మానించే కార్యక్రమంలో భాగంగా మూల్పూరుకు చెందిన వెస్ట్రన్ డాన్స్ మాస్టర్ రిమ్మనపూడి మణికంఠను ఉత్సవ కమిటీ సభ్యులు సన్మానించి ఎన్టీఆర్ జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో వక్తలు ఎన్టీఆర్ అభిమాని మొహమ్మద్ నఫీస్, షేక్ జానీలు ముస్లింలు కోసం ఎన్టీఆర్ సినిమాలు అనే అంశంపై ప్రసంగించారు. అనంతరం వక్తలను ఉత్సవ కమిటీ సభ్యులు సన్మానించారు. ఈకార్యక్రమంలో డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, దేవరపల్లి భవాని, ఎన్టీఆర్ జగన్, ఎం రాఘవరావు, డి భాస్కర్, బెల్లంకొండ వెంకట్, కన్నెగంటి మధు తదితరులు పాల్గొన్నారు.



గాలిగోపురం వద్ద అన్నదానం

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వార్ల దేవస్థానం గాలిగోపురం వద్ద శ్రీపేద అనాధల మాత సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సంఘం ప్రధానకార్యదర్శి చెన్నుబోయిన వెంకట నరసయ్య మాట్లాడుతూ అన్నదాన కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు సాదరబోయిన నాగేశ్వరరావు,కార్యదర్శి పేరం పూర్ణచంద్రరావు,కోశాధికారి యన్నం శివనాగేశ్వరరావు, ఎస్.శ్రీనివాసరావు,జె.రోహిత్,చీమట సురేష్, ఎల్.సాంబ శివరావు, జె.శ్రీనివాసరావు,పి.నవ్యశ్రీ, పాల్గొన్నారు.



మనోహార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వాకర్స్ క్లబ్-2 బృందం

వాకర్స్ క్లబ్-2 వ్యవస్థాపకులు మనోహర్‌కు నివాళి

ప్రజాశక్తి - తెనాలి

వాకర్స్ క్లబ్ తెనాలి 2 వ్యవస్థాపకులు, గుంటూరు జిల్లా పరిషత్ విశ్రాంత మేనేజర్ విడిఆర్. మనోహర్ సంస్మరణ సభ ఆదివారం స్థానిక సుల్తానాబాద్‌లోని ప్రైవేట్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించారు. తొలుత మనోహర్ చిత్రపటానికి వాకర్స్ క్లబ్ టు బృందం నివాళులర్పించారు. గతంలో ఆయన గుంటూరు జిల్లాపరిషత్ మేనేజరుగా, కర్నూలు జిల్లాపరిషత్ అసిస్టెంట్ సిఈఒ గాను, ఏలూరు జిల్లాపరిషత్ సిఈఒగాను పని చేశారు. ఉద్యోగవిరమణ అనంతరం ఉడా కాలనీలో నివసిస్తూ వాకర్స్ క్లబ్ తెనాలి-2 ద్వారా పలు సేవాకార్యక్రమాలు నిర్వహించారని, ప్రతి ఏడాది తన పెక్షన్ సొమ్ములో కొంత భాగం స్వచ్ఛందంగా ఖర్చు చేసే వారని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్ తెలిపారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు వీరమాచనేని శ్రీనివాసు, భుజంగరావు, బుచ్చిబాబు, భాస్కరరావు, సూరిబాబు, వి. వెంకటేశ్వరరావు, డి. వి. సోమయ్య శాస్త్రి, రాధాకృష్ణ, సిహెచ్ కృష్ణారావు, బి.వి. రాఘవయ్య చౌదరి, పి.రాఘవేంద్రరావు, డా. టి.లక్ష్మీనారాయణ, కె వెంకట్రావు, ఎం.చలపతిరావు, జి.రామ్మోహన్, పి.సుధాకరరావు పలువురు విశ్రాంత ఉద్యోగులు , వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



సెలూన్ చైర్ అందజేత

ప్రజాశక్తి-తాడేపల్లి

పట్టణంలోని 23వ వార్డు మహానాడుకు చెందిన చింతాడ రవి కొన్ని సంవత్సరాల నుంచి స్థానికంగా బార్బర్ షాపు నిర్వహిస్తున్నాడు. తనకు సెలూన్ చైర్ కావాలని నారా లోకేష్‌కు అర్జీ పెట్టుకున్నాడు. ఆదివారం రవికి నారా లోకేష్ పంపిన సెలూన్ చైర్‌ను పట్టణ టిడిపి కార్యదర్శి దారా దాసు, కె.అంజిరెడ్డి, ఎస్.అశోక్, డి.వీరాంజనేయుల, దొడ్డిపాటి వెంకటేశ్వర్లు అందజేశారు. కుల వృత్తిపై జీవనం సాగిస్తున్న తనకు సెలూన్ చైర్ అందజేసినందుకు లోకేష్‌కు రవి ధన్యవాదాలు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న చాంద్‌బాషా

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ఎన్నికలప్పుడు ఇచ్చిన ఏ ఒక్క హామీనీ నెరవేర్చని ప్రభుత్వం : ఎపిజిఇఎ జిల్లా అధ్యక్షులు చాంద్‌బాషా

ప్రజాశక్తి-గుంటూరు

ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం ప్రాధాన్యతాంశంగా తీసుకోవట్లేదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు సయ్యద్ చాంద్‌బాషా ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం నగరంపాలెంలోని ఎపిజిఇఎ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఏఒక్క హామీ నెరవేర్చలేదని అన్నారు. ఈ రోజు వరకూ ప్రభుత్వం ఒక్క డిఎ కూడా మంజూరు చేయకపోవటంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి, ఉద్యోగుల సమస్యలపై మంత్రివర్గ ఉపసంఘంతో చర్చించి, ఉద్యోగుల ప్రయోజనాలు కాపాడాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కరీముల్లా షాఖాదరి, జిల్లా ఉపాధ్యక్షులు మహేష్‌బాబు, నగర శాఖ అధ్యక్షులు నాగేశ్వరరావు, నాయకులు రత్తయ్య, హుస్సేన్‌ఖాన్ పాల్గొన్నారు.

మురుగుతో నిండిన పంటకాల్వ

పంటలు పాడవుతున్నా.. దుర్గంధం వెదజల్లుతున్నా పట్టించుకునే వారేరి?

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్



కాల్వలోని మురుగునీరు.. పరిశీలిస్తున్న నాయకులు



సాగునీటితో గలగల పారిన పంట కాల్వ నేడు మురుగు నీటితో దుర్గంధం వెదజల్లుతోంది. ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లిలో కాల్వ దుస్థితిని సిపిఎం, రైతు సంఘం నాయకులు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు మాట్లాడుతూ కుంచనపల్లిలోని ఆంధ్రరత్న పంపింగ్ స్కీం నుండి ప్రాతూరు, చిర్రావూరు, రామచంద్రపాలెం వరకు సుమారు 3,600 ఎకరాలకు నీరందించిన పంట కాల్వ దుస్థితి అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోందని అన్నారు. కుంచనపల్లి పరిసర ప్రాంతాల్లో బహుళంతస్తుల భవనాలు నిర్మితమయ్యాక ఆ భవనాల్లోని వ్యర్థపు నీరంతా పంట కాల్వకే వదులుతున్నారన్నారు. దీనివల్ల కాల్వ పూర్తిగా దెబ్బతిని, మురుగినీటి కాల్వగా మారిందని చెప్పారు. సాగు నీటిలో మురుగు నీరు కలవడం, వాటిని పొలాలకు పెట్టడంతో పంటలన్నీ దెబ్బతింటున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. తమ పచ్చని పొలాలు దెబ్బతింటున్నాయని, మురుగునీరు వలన చర్మ వ్యాధులు వస్తున్నాయని చిర్రావూరు రైతులు పలుమార్లు ఆందోళన చేసినా అధికారులెవరూ పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతు సంఘం ఆధ్వర్యంలో అధికారులను కలిసి రైతుల సమస్యను అనేకసార్లు విన్నవించినా స్పందన లేకపోవడం దుర్మార్గమన్నారు. సిపిఎం మండల కార్యదర్శి డి.వెంకటరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నివాసానికి కిలోమీటర్ల లోపు ఉన్న పంట కాల్వను అధికారులు పట్టించుకోకపోవడం రైతుల పట్ల నిర్లక్ష్యానికి తార్కాణమని అన్నారు. 1965లో కుంచనపల్లిలో ఏర్పాటు చేసిన ఆంధ్రరత్న పంపింగ్ స్కీం ద్వారా ఐదు గ్రామాలకు సుమారు 3600 ఎకరాలకు నీరందేదని, ప్రస్తుతం పంట కాల్వ పూర్తిగా దెబ్బతిని, పొలాలకు నిరందించే పరిస్థితి లేదన్నారు. అంతేకాకుండా రూ.లక్షలతో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు నిర్మించిన డ్రెయినేజీలు నిరుపయోగంగా మారాయని, మురుగు నీటిని పంట కాల్వకు మళ్లించడం సరికాదని అన్నారు. కుంచనపల్లి అరవింద హైస్కూల్ వద్ద పంట కాల్వ దుస్థితి మరింత దారుణంగా మారిందని, పూర్తిగా మురుగునీరుతో దుర్గంధం వెదజల్లుతోందని ఆందోళ వ్యక్తం చేశారు. దీనివలన అంటు వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని అన్నారు. దోమల ఉధృతి పెరిగి విద్యార్థులకు చర్మ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. అపార్టుమెంట్ల నుండి వచ్చే డ్రెయినేజీ నీటిని శుద్ధి చేసి మద్రాసు కాల్వకు మళ్లించాలని, ఇందుకు ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను సత్వరమే నిర్మించాలని, పంట కాల్వను బాగుచేయించాలని డిమాండ్ చేశారు. పరిశీలనలో నాయకులు ఎ.రంగారావు, కె.వెంకటేశ్వరరావు, ఎ.రామారావు పాల్గొన్నారు.

ఇదిలా ఉండగా పంట కాల్వ దుస్థితిని పరిశీలించేందుకు వచ్చిన నాయకులను అరవింద హైస్కూల్ ప్రిన్సిపాల్ బి.ఇంద్రాణి కలిసి మాట్లాడారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలు, ప్రభుత్వానిదని అన్నారు. 35 ఏళ్లుగా హైస్కూల్‌ను ఆహ్లాదకరమైన వాతావరణంలో నడుపుతున్నామని, కొంతకాలంగా కాల్వ చుట్టూ వ్యర్థాలతో నిండిపోయి దుర్గంధం వెదజల్లుతోందని చెప్పారు. ఈ దుస్థితిపై తనతో పాటు, విద్యార్థులు కూడా ముఖ్యమంత్రికి లేఖలు రాశామని, అయినా స్పందన, పరిష్కారం లేదని అన్నారు. స్కూలు సమీపంలో ఉన్న పంట కాల్వ దుస్థితి దారుణంగా ఉందని, మురుగునీటి దుర్గంధం వల్ల విద్యార్థులు ముక్కు మూసుకొని మరి స్కూలు వైపుకు వెళ్లే పరిస్థితి దాపురించిందని చెప్పారు. ప్రస్తుతం తాగునీరూ కలుషితమై పిల్లల్లో రోగ నిరోధక శక్తి తగ్గుతోం దన్నారు. కలుషిత వాతావరణం, మురుగునీరు వల్ల అనారోగ్యానికి గురై పిల్లలు, పెద్దలు జబ్బుల బారిన పడే ప్రమాదం ఉందని చెప్పారు. వ్యర్థాలను, మురుగు నీటిని పంట కాల్వలో మళ్లించకుండా ఎక్కడికక్కడే తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

అధికంగానే ఫ్లూ జ్వరాలు

- కరోనా నాలుగో దశ ఉధృతంగా లేదు
- 104 వాహనాల్లో గ్రామాలకు వైద్యులు
- ప్రజాశక్తితో పల్నాడు జిల్లా వైద్యాధికారి శోభారాణి





కరోనా ఉధృతి లేకున్నా ప్రజలు జాగ్రత్తలు కొనసాగించాలని పల్నాడు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి (డిఎంహెచ్‌ఒ) జి.శోభారాణి సూచించారు. ప్రస్తుతం కరోనా నాలుగో దశ వస్తోందని, వైద్య సిబ్బంది, అధికారులు అప్రమత్తంగా ఉన్నారని చెప్పారు. ఫ్లూ జ్వరాలు ఎక్కువగా వస్తున్నాయని, ప్రజలు మాస్కులు కొనసాగించాలని అన్నారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలపై మాట్లాడారు.

కరోనా నాలుగో దశను ఎలా ఎదుర్కొంటారు?

కరోనా నాలుగో ఉధృతిని ఎదుర్కొనేందుకు శాఖా పరంగా సిద్ధంగా ఉన్నాం. గతంలో ఎదుర్కొన్న పరిస్థితులపై అవగాహన ఉన్న నేపథ్యంలో ఇప్పటికిప్పుడు కేసులు వచ్చినా ఏయే అంశాలపై జాగ్రత్త పడాలి? క్షేత్రస్థాయిలో ఏం చేయాలి? అనే అంశాలపై వైద్యారోగ్య శాఖలో కిందిస్థాయి ఉద్యోగుల నుంచి నిపుణులైన వైద్యులతో చర్చిస్తున్నాం. ప్రస్తుతం కేసులు పెద్దగా లేవు.

ప్రస్తుత దశ కరోనా లక్షణాలు ఎలా ఉంటున్నాయి?

జ్వరం, జలుబు, దగ్గు, గొంతు నొప్పి, తలనొప్పి, నీరసం, ఆయాసం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తదితర లక్షణాలుంటే వెంటనే దగ్గర్లోని ఆస్పత్రుల్లో పరీక్ష చేయించుకోవాలి. పిహెచ్‌సిలు, సిహెచ్‌సిలలో రాపిడ్ కిట్లు అందుబాటులో ఉన్నాయి. ఆధార్ కార్డు తీసుకువెళ్లి పరీక్షలు చేయించుకోవచ్చు. పాజిటివ్ వస్తే వెంటనే ఐసోలేషన్ వార్డుకు తరలిస్తారు. సందేహాలేమైనా ఉంటే 104 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి వాటిని నివృత్తి చేసుకోవడంతోపాటు సలహాలు, సూచనలను పొందొచ్చు. పల్నాడు జిల్లాలో మార్చి, ఏప్రిల్ నెలలో 39 మందికి వైరస్ సోకినట్లు నిర్ధారణవగా వారికి సమర్థవంతంగా చికిత్స చేశాం. లింగంగుంట్లలోని డాక్టర్ వైఎస్ఆర్ జిల్లా హాస్పిటల్‌లో వెయ్యి లీటర్ల సామర్థ్యం గల అత్యాధునిక ఆక్సిజన్ ప్లాంట్ అందుబాటులో ఉంది.

సీజనల్ వ్యాధుల పరిస్థితి ఎలాఉంది ?

ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ఎక్కువగా ఫ్లూ జ్వరాలు వస్తున్నాయి. జిల్లాలో ఫ్లూ కేసులు ఎక్కువగా నమోదవుతున్న వేళ జాగ్రత్తలు తీసుకోవాలని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎంఆర్) సూచించింది. వైరల్ ఫీవర్లు, జ్వరం, జలుబు, దగ్గుతోపాటు సాధారణ వ్యాధులైన బిపి,షుగర్ వేసవి నేపథ్యంలో వడదెబ్బ సూచనలు కలిగిన రోగులు చికిత్స కోసం వస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఆయా వ్యాధుల బారిన పడిన వారికి చికిత్సలు చేస్తున్నాం. అన్ని రకాల మందులూ అందుబాటులో ఉన్నాయి. దీర్ఘకాలంగా జలుబు, దగ్గు, జ్వరం ఉన్నవారు నిర్లక్ష్యం చేస్తే వ్యాధి ఉధృతి పెరిగే అవకాశం ఉంది. మరికొందరిలో శ్వాసకోశ సమస్యలతో పాటు వైరల్ జ్వరాలు ఎక్కువ శాతం పిల్లలకు వ్యాపించి పిల్లల ద్వారా కుటుంబంలోని అందరికీ వచ్చే అవకాశం ఉంది. విచక్షణా రహితంగా యాంటీబయోటిక్స్ వాడొద్దు. సాధారణ జ్వరాలు మూడ్రోజుల్లో తగ్గితే దగ్గు మాత్రం మూడు వారాల వరకు ఉంటుంది. వైరస్ బారిన పడిన రోగులు పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలి. జిల్లా వైద్యశాలను రోజుకు 700 నుండి 900 వరకు ఓపిలు వస్తుంటే ఇందులో 250 వరకు జ్వరం, దగ్గు, ఒళ్లు నొప్పులతో వచ్చేవారి సంఖ్య ఉంది. జిల్లాలోని మిగతా ఆస్పత్రుల్లోనూ ఇదే పరిస్థితి ఉంది.

ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం ఎలా ఉంది?

పల్నాడు జిల్లాకు 104 వాహనాలు 31 కేటాయించారు. గ్రామాలకు వెళ్లి ప్రజలకు ఆరోగ్య సలహాలు వ్యాధులతో బాధపడుతున్న వారికి మందులు ఇస్తున్నారు. వ్యాధి తీవ్రత ఎక్కువుగా ఉంటే దగ్గర్లోని పిహెచ్‌సి లేదా ఏరియా వైద్యశాలకు సిఫార్సు చేస్తారు.

ప్రజాశక్తి - నరసరావుపేట



సమావేశంలో మాట్లాడుతున్న నేతాజి

పోరాటానికి ఆశ వర్కర్లు సన్నద్ధం కండి

యూనియన్ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నేతాజి

ప్రజాశక్తి - గుంటూరు

ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, సెలవులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సాధనకు ఆశ వర్కర్లు పోరాటానికి సిద్ధం కావాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి పిలుపునిచ్చారు. ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా సమావేశం పాత గుంటూరులోని సిఐటియు కార్యాలయంలో కె.లక్ష్మి అధ్యక్షతన ఆదివారం జరిగింది. నేతాజి మాట్లాడుతూ ఆశ వర్కర్లకు వేతనాలు పెంచామని చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం అలవిగాని పనిభారాన్ని మోపి తీవ్ర మానసిక ఒత్తిడికి గురి చేస్తోందని విమర్శించారు. ఫలితంగానే రాష్ట్రంలో ఇటీవల ఇద్దరు ఆశ వర్కర్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారన్నారు. ఆశా వర్కర్లకు సంక్షేమ పథకాలన్నీ రద్దు చేస్తున్నారని, రిటైర్మెంట్ బెనిఫిట్లు కూడా ఏమీ లేకుండా 60 ఏళ్లకు రిటైర్మెంట్ చేస్తున్నారని అన్నారు. రిటైర్మెంట్ అనంతరం ఆశా వర్కర్ల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చి 9 ఏళ్లు పూర్తవుతున్నా ఈ కాలంలో కేంద్ర ప్రభుత్వ పథకాలైన అంగన్వాడీ, మధ్యాహ్న భోజనం, ఆశ తదితర పథకాల కార్మికులకు ఒక్క రూపాయి కూడా జీతం పెంచలేదని, కాకులను కొట్టి గద్దలను మేపుతున్న విధంగా మోడీ పాలన ఉందని మండిపడ్డారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.జ్యోతి మాట్లాడుతూ ఆశా వర్కర్లకు సెలవుల సౌకర్యం లేదని, నిర్దిష్టమైన పని గంటలు లేవని, అన్ని పనులూ అధికారులు పైస్థాయి ఉద్యోగులు ఆశా వర్కర్లపై నెట్టి వెట్టిచాకిరి చేయిస్తున్నారని అన్నారు. యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.ధనలక్ష్మి మాట్లాడుతూ ఆశా వర్కర్లు ఐక్యమై ప్రతిఘటించడం ద్వారానే హక్కులను కాపాడుకోగలరని పిలుపునిచ్చారు. సమావేశంలో యూనియన్ జిల్లా నాయకులు స్వర్ణకుమారి, టి.ధనలక్ష్మి, డి.పద్మావతి, కె.శ్యామల పాల్గొన్నారు.